

షష్టి సందడి



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉంగుటూరు మండలం కైకరం, ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏలూరు పోస్టల్ కాలనీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తుల పూజలు



6

వివాహం..ఆడంబరం

» వివాహాలకు మూడేళ్లలో 50 శాతం పెరిగిన ఖర్చు




సమావేశంలో మాట్లాడుతున్న జేడీ రమణ

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ముగిసిన శిక్షణ

ఏలూరుసిటీ, డిసెంబరు 7: ప్రజల కనీస అవసరాలు తీరుస్తూ భవిష్యత్ తరాల కోసం వనరులను మిగులుస్తూ సహజ వనరులను వివేకంగా వినియోగించేది సుస్థిరత అని ఏపీ ఎస్ఐఆర్‌డీ పీఆర్ జాయింట్ డైరెక్టర్ జి.రమణ అన్నారు. ఏలూరులోని డీపీఆర్సీలో ఈనెల 5వ తేదీ నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు నిర్వహిస్తున్న ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జడ్పీ సీఈవో విజయరాజు జంగారెడ్డిగూడెం డీఎల్‌డీవో ఎం.రాజు, డీపీఆర్సీ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి ప్రసంగిరాజు, డిపిఓ కె అనూరాధ, డిఎల్‌డిఓ వై దోసిరెడ్డి ఇతర అధికారులు , సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల పుస్తకాల పంపిణీ

ఏలూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో ఆరునెలల నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలబాలికలకు అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు. తొలుత ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారులవద్దకు తీసుకెళ్లి చికిత్స అందిస్తారని వివరించారు. ప్రతీ విద్యార్థికి పదిపేజీలతో కూడిన ఆరోగ్యపరీక్షల పుస్తకాన్ని అందజేస్తామన్నారు.



ముసునూరు జడ్పీ పాఠశాలలో విద్యార్థినికి హెల్త్‌కార్డును అందజేస్తున్న మంత్రి పార్థసారథి



దెందులూరు హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో కలెక్టర్ వెట్రిసెల్వి

మెగా పీటీఎం.. సూపర్‌హిట్

» ఇక ప్రతి మూడు నెలలకోసారి పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు
» నేటి సాయంత్రంలోగా నిర్ణీత యాప్‌లో వివరాల నమోదుకు ఎస్ఎంసీ చైర్మన్లకు అధికారాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన రావడంతో ఇకమీదట ప్రతీ మూడు నెలలకోసారి పేరెంట్స్, టీచర్స్ సమావేశా (పీటీఎం)లను నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈమేరకు పాఠశాలవిద్య ఉన్నతాధికారులు సంకేతాలు పంపారు. జిల్లావ్యాప్తంగా శనివారం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు మొత్తం 1889 స్కూల్స్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం విజయవంతంగా నిర్వహించినట్టు జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. ఈ సమావేశానికి మొత్తం 1,34,200 మంది బాలబాలికలు, సుమారు 52 వేల మంది పేరెంట్స్, 4609 మంది ఉపాధ్యాయులు హాజరుకాగా విద్యార్థుల ప్రగతిని వివరించే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందజేసి, చర్చించారు. మొత్తం 1300 మంది దాతలు, విద్యావేత్తలు, పూర్వవిద్యార్థులు హాజరుకాగా, కొన్నిచోట్ల పాఠశాల అభివృద్ధికి దాతలు, పూర్వవిద్యార్థులు వస్తు, నగదు రూపంలో విరాళాలు ప్రకటించారు. పీటీఎంకు జిల్లావ్యాప్తంగా మొత్తం 14,500 మంది స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల సభ్యులు హాజరుకాగా, స్కూలుతో సంబంధంలేని మరో 10 వేల మంది స్థానిక ప్రజలు సమావేశాలకు వచ్చారని విద్యాశాఖ ప్రకటించింది. కొన్ని పాఠశాలల్లో అసంపూర్తిగా వున్న నాడు-నేడు తరగతి గదుల భవనాలు, వివిధ పనులను పూర్తి చేయాలని సూచనలురాగా, వీటన్నింటినీ వచ్చే ఏడాది జనవరి తర్వాత ప్రారంభించి వేసవి సెలవులు ముగిసేలోగా పూర్తిచేయడానికి ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన విషయాన్ని అధికారులు పేరెంట్స్‌కు తెలిపారు. పీటీఎంలలో వచ్చిన సూచనలు, సలహాలు, స్కూలుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు తదితర అంశాలన్నింటినీ నమోదు చేసేందుకు ఎస్ఎంసీల చైర్మన్ల కోసం విద్యాశాఖ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో ఎస్ఎంసీ చైర్మన్లు లాగిన్‌అయ్యి ఫొటోలను, నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలను నమోదుచేసి ఆదివారం సాయంత్రంలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా యాప్‌లో నమోదైన వివరాలను క్రోడీకరించి తదుపరి కార్యాచరణను చేపడతారు. కాగా ముసునూరు జడ్పీ పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో, అంకితభావంతో పిల్లలకు అర్థం అయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు. దెందులూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దెందులూరులోని చిల్డ్రన్ హోంకు చెందిన 17 మంది బాలికలకు సంరక్షకురాలి (కస్టోడియన్)గా వ్యవహరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి సంబంధిత విద్యార్థినుల ప్రగతిని వివరించే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను సంతకం పెట్టి తీసుకున్నారు. పెదపాడు మండలం వట్లూరులోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశంలోను కలెక్టర్ పాల్గొన్నారు. బుట్టాయగూడెం మండలం తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కేఆర్ పురం ఐటీడీఏ పీవో, జేసీ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. చింతలపూడిలోని సుబ్బరాజు హైస్కూలులో జరి గిన పేరెంట్స్ సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పాల్గొన్నారు.



తెల్లంవారిగూడెం ఆశ్రమ పాఠశాలలో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న ఐటీడీఏ పీవో, జేసీ ధాత్రిరెడ్డి



చింతలపూడిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ప్రతాప శివకిశోర్

నీరుగార్చారు..!

» జలజీవన్ మిషన్ పథకాన్ని పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
» నిధులున్నా నత్తనడకన పనులు
» ప్రభుత్వ తీరుతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వెనుకంజ
» జిల్లాలో సుమారు రూ.ఆరు కోట్ల బకాయిలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలందరికీ ఉచిత రక్షిత మంచి నీరు అందించేందుకు ప్రతీ ఇంటికి మంచినీటి కుళాయి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించిన జలజీవన్ మిషన్ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం నీరుగార్చింది. దీంతో ప్రతీ ఇంటికి ఉచిత రక్షిత మంచి నీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా నెరవేరకుండా మధ్యలోనే నిలిచిపోయింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు జలజీవన్ మిషన్ పథకం నిధులు రూ.454.10 కోట్లు మంజూరు కాగా వాటిలో కేవలం రూ.89.45 కోట్ల పనులు మాత్రమే చేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉంది. దీనిపై ఇప్పటికే కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా పల్స్ సర్వే నిర్వహించగా గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం తేటతెల్లమైంది. ఈ విషయంపై ఈనెల మూడో తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పథకం ముఖ్య ఉద్దేశ్యం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడకుండా ఉండాలని వారికి రక్షిత తాగునీరు అందించడానికి కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని 2019 ఆగస్టులో ప్రారంభించింది. ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులను కలిపి గ్రామాల్లో బోర్లు, మంచి నీటి పైప్‌లైన్లు, మంచినీటి ట్యాంకులు, ప్రజల ఇళ్ల వద్ద కుళాయిలు వేయాలి. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా గత వైసీపీ ప్రభుత్వం మ్యాచింగ్ నిధులు విడుదల చేయక పోవడంతో జిల్లాలో పనులన్నీ నిలిచిపోయాయి. జిల్లాలో చేసిన వివిధ పనులకు రూ.ఆరు కోట్లు బకాయిలు ఇప్పటికీ విడుదల కాలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించక పోవడంవల్ల జిల్లాలో జలజీవన్ మిషన్ పనులు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో పనులన్నీ నిలిచిపోయాయి. రూ.ఐదు లక్షల లోపు మంచినీటి సౌకర్యం కల్పించే పనులను విలేజ్ లెవెల్ వాటర్ శానిటేషన్ కమిటీల ద్వారా చేయించుకునే వెసులుబాటు ఉంది. ఈ కమిటీలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థుల్లో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పలువురుతో కలిపి పదిహేను మంది ఉంటారు. రూ.ఐదు లక్షలు దాటిన ప్రతీ పనికి టెండరు వేసిన కాంట్రాక్టరు పనులు చేపడతారు.

ఐదు సబ్ డివిజన్‌ల పరిధిలో వివరాలు..

- ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో ఏడు మండలాల్లో 1,49,203 గృహాలుండగా ఇప్పటి వరకు 1,39,694 గృహాలకు మంచినీటి కుళాయిలు ఇచ్చారు. వీటికోసం రూ.181.56 కోట్లు మంజూరు కాగా రూ.47.94 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా 71 పనులు జరగాల్సి ఉంది.
- కైకలూరు సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 78,250 గృహాలుండగా ఇప్పటి వరకు 45,890 గృహాలకు మంచినీటి కుళాయిలు ఇవ్వగా వీటికోసం రూ.70.68 కోట్లు మంజూరు కాగా కేవలం రూ.8.87 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా 45 పనులు జరగాల్సి ఉంది.
- జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 83,027 గృహాలుండగా 79,176 గృహాలకు మంచినీటి కుళాయిలు ఇచ్చారు. వీటికోసం రూ.35.66 కోట్లు మంజూరు కాగా రూ.10.33 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా 34 పనులు జరగాల్సి ఉంది.



జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో నిలిచిపోయిన వాటర్ ట్యాంకు

- కొయ్యలగూడెం సబ్ డివిజన్‌లో ఏడు మండలాల్లో 1,02,559 గృహాలుండగా ఇప్పటి వరకు 84,943 గృహాలకు మంచినీటి కుళాయిలు ఇచ్చారు. వీటికోసం రూ.62.77 కోట్లు మంజూరు కాగా రూ.10.11 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా 144 పనులు జరగాల్సి ఉంది.
- నూజివీడు సబ్ డివిజన్‌లో నాలుగు మండలాల్లో 61,939 గృహాలుండగా 61,719 గృహాలకు మంచినీటి కుళాయిలు ఇచ్చారు. రూ.103.43 కోట్లు మంజూరు కాగా రూ.12.2 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా 12 పనులు చేపట్టాల్సి ఉంది.

పెండింగ్ బిల్లులు జమ

జిల్లాలో ఐదు సబ్ డివిజన్ల పరిధిలో 4,74,978 గృహాలుండగా ఇప్పటివరకు 4,11,422 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశాం. ఇంకా 63,556 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.454.10 కోట్లు బడ్జెట్ మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.89.45 కోట్లు ఖర్చు చేశాం. 306 పనులు ప్రోగ్రెస్ లో ఉన్నాయి. దాదాపు రూ.ఆరు కోట్లు పాత బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పు డిప్పుడే పెండింగ్ బిల్లులు జమ చేస్తున్నా రు. ఇప్పటివరకు టెండర్లు ఖరారు కాని పనులకు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మళ్లీ టెండర్లు పిలిచి పనులను త్వరిత గతిన పూర్తిచేస్తాం.

జి.త్రినాథబాబు, ఎస్ఈ (ఎఫ్ఏసీ)

జీలుగుమిల్లి డీటీ ప్రదీప్ సస్పెన్షన్

జీలుగుమిల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి డిప్యూటీ తహసీల్దారు బి.ప్రదీప్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల మండలానికి చెందిన కొందరు రైతులు తమ పొలం మరొకరి పేరున ఆన్‌లైన్ చేసినట్టు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీంతోపాటు పలువురు భూముల ఆన్‌లైన్ విషయమై కొద్ది రోజులుగా డీటీ లంచాలు తీసుకుని భూముల ఆన్‌లైన్‌కు పాల్పడుతున్నట్టు కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేసినట్టు సమాచారం. తాటియాకులగూడెం, చిర్రివారిగూడెం గ్రామాలకు చెందిన కొందరు ఆయనపై ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ ఫిర్యాదులపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే డీటీని సస్పెండ్ చేస్తూ జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయానికి సమాచారం అందింది. డీటీ సస్పెండ్ విషయమై జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవి.రమణను వివరణ అడగ్గా సస్పెండ్‌కు పూర్తి కారణాలు తనకు తెలియదన్నారు.

ఇన్వెస్టర్లే టార్గెట్



» ఆన్‌లైన్‌లో కొత్త మోసాలు » నకిలీ యాప్‌లతో స్టాక్ మదుపుదారులకు వల » జీరో కమిషన్ పేరుతో మోసం » జిల్లాలో వెలుగుచూస్తున్న మోసాలు

నరసాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నరసాపురం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వాట్సప్‌లో ఏడాది క్రితం ఒక గ్రూప్ క్రియేట్ అయింది. అది ప్రముఖ స్టాక్ బ్రోకర్‌కు చెందిన కార్పొరేట్ సంస్థ. గతంలో ఈ వ్యక్తి ఈ బ్రోకరేజ్ సంస్థలో అకౌంట్ నిర్వహించారు. కొంతకాలం క్రితం దాన్ని మూసివేశాడు. మళ్లీ ఇప్పుడు వాట్సప్‌లో ఆ సంస్థ పేరుతో గ్రూప్ క్రియేట్ అవ్వడంతో ఆ బ్రోకరేజ్ సంస్థే తన పేరును యాడ్ చేసి ఉండవచ్చునని భావించాడు. ప్రతి రోజు ఆగ్రూప్‌కు మెసేజ్‌లు వస్తున్నాయి. వాటిని పరిశీలిస్తూ వచ్చాడు. ఒక రోజున ఆ సంస్థ నుంచి మాట్లాడుతున్నమంటూ కాల్ వచ్చింది. మళ్లీ అకౌంట్ తెరవండి ఏడాది వరకు డీమేట్ చార్జీలు ఉండవ్, కమిషన్ జీరో అంటూ నమ్మబలికింది. దీనికి సంబంధించి ఒక లింక్ పంపింది. ఆ వ్యక్తి దాన్ని నొక్కి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. దాని ద్వారా ముందుగా రూ.5లక్షలు నగదు పంపాడు. కొన్నిషేర్లు కొన్నాడు, ఆ తరువాత ప్రతి రోజు ఇతనితో ఓ మహిళ మాట్లాడుతూ వచ్చింది. ఐపీవోలు దరఖాస్తులు చేయండి మా సంస్థ ద్వారా మీకు లాట్లు తగులుతాయని ఆశ చూపించింది. వీటిని నమ్మి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. కొంతకాలానికి ఐపీవో మార్కెట్‌లోకి వచ్చింది. భారీ ధర పలికింది. దీంతో ఈ వ్యక్తి షేర్లను అమ్మేశాడు. యాప్ నుంచి అకౌంట్‌లోకి సొమ్మును బదిలీ చేసే ప్రయత్నం చేశాడు. అది అవ్వడం లేదు. దీంతో రోజు కాల్ చేస్తున్న మహిళకు ఫోన్ చేసి కనుక్కునే ప్రయత్నం చేశాడు. అయితే సమాధానం లేదు. దీంతో ఎవరిని సంప్రదించాలో తెలియలేదు. చివరికి పోలీసుల్ని ఆశ్రయించాడు. ఇలాంటి సంఘటన ఇటీవల మరొక్కటి చోటు చేసుకుంది. ఫేస్‌బుక్‌లో చూసి ఓ వ్యక్తి ఆ కంపెనీ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నాడు. యాప్ ద్వారానే సొమ్మును బదిలీ చేశాడు. ఆరు నెలల వరకు పెట్టుబడులు పెడుతూ వచ్చాడు. కొన్ని షేర్లను అమ్మాడు. అయితే సొమ్ము రావడం లేదు. కంపెనీకి ఫోన్ చేస్తే సమాధానం లేదు. తీరా ఆరా తీస్తే డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ నకిలీదని తేలింది. కార్పొరేట్ సంస్థకు చెందిన ప్రముఖ స్టాక్‌బ్రోకర్ కంపెనీ యాప్‌ను సేమ్‌టూ సేమ్ దించారు. అయితే అందులో రెండు చోట్ల చుక్కలు ఉన్నాయి. దీని వల్ల గుర్తించలేని పరిస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో ఇటీవల చాలా మోసాలు వెలుగుచూశాయి. అన్ని స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మదుపుదార్లే టార్గెట్‌చేస్తూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ మదుపుదారుల్ని ముంచేస్తున్నారు. ఏడాది వరకు జీరో కమిషన్, డీమేట్ చార్జీలు లేవంటూ నమ్మబలికి గేలం వేస్తున్నారు. తీరా నమ్మి లింకును క్లిక్ చేస్తే నకిలీ యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. పెట్టుబడి పెట్టిన సొమ్ము అకౌంట్‌లో కనిపిస్తుంది. కొన్న షేర్లు కనిపిస్తాయి. వచ్చిన లాభాలు, నష్టాలు కూడా కళ్ళముందే ఉంటా యి. అయితే అమ్మితే సొమ్ము రాదు. ఇలా అమాయకులకు గేలం వేసి లక్షలు లక్షలు దోచేస్తున్నారు.

ఈ షేర్లు కొంటే లాభాలే అంటూ మోసం..

ఏదైనా స్టాక్ బ్రోకర్ దగ్గర అకౌంట్ ఉంటే చాలు ఆ నెంబర్ దేశంలో ఉన్న మోసగాళ్ల అందరికి వెళ్లిపోతుంది. ప్రతిరోజు ఫోన్లు వస్తాయి, మీకు బాగా పెరిగే కంపెనీ షేర్లు చెబుతాం, ఒక నెల మాకు సొమ్ము చెల్లించనవసరం లేదు. నమ్మకం కలిగి లాభాలు వస్తే ఆ తరువాత మాకు ఫీజు ఇవ్వండి అంటూ నమ్మిస్తారు. వీరు చెప్పిన షేర్లు నమ్మి కొంటే అంతే ఇలా చాల మంది మదుపుదారులు నష్టపోతున్నారు. కొన్ని కంపెనీలతో వీరు ఒప్పందం కుదుర్చుకుని అమాయకులైన మదుపుదారుల్ని నమ్మించి వారితో ఆ కంపెనీ షేర్లు కొనిపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ మోసమే ఎక్కువగా జరుగుతుంది. మనం కొన్న తరువాత వార్ని సంప్రదించే ప్రయత్నం చేసినా... ఆ నెంబర్ పని చేయదు, బరోడా, బెంగళూరు, ఛత్తీస్‌ఘడ్, భూపాల్, గుజరాత్ నుంచి ఎక్కువగా ఈ ఫోన్ కాల్స్ వస్తుంటాయి

లింక్‌లను క్లిక్ చేయొద్దు


యాదగిరి, టౌన్ సీఐ



సోషల్ మీడియాలో స్టాక్ మార్కెట్‌కు సంబంధించి అనేక వీడియోలు వస్తుంటాయి. వాటికి దూరంగా ఉండాలి. క్లిక్ చేయకూడదు. వాటిని విని ఆ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టకూడదు. కొందరు కేటుగాళ్ళు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలంటే నమ్మకమైన కార్పొరేట్ సంస్థల బ్రాంచ్‌ల్లో సంప్రదించాలి. అక్కడ అకౌంట్ తెరవాలి. వారి యాప్‌లనే వినియోగించాలి, లేదా ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెడ్‌ఎఫ్‌సీ వంటి బ్యాంకులు కూడా ట్రేడింగ్ నిర్వహిస్తున్నాయి. బ్యాంకు అకౌంట్‌కు అనుసంధానం ఉండే ఇటువంటి బ్యాంకులకు సంబంధించి ట్రేడింగ్ సంస్థల్లో యాప్‌లు వినియోగిస్తే ఎటువంటి మోసానికి అస్కారం ఉండదు. అంతేగాని ప్లేస్టోర్‌కి వెళ్లి యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటే మోసపోయినట్లె. ప్రస్తుతం నరసాపురంలో నమోదైనకేసుల్లో మోసం గుజరాత్, ఉత్తరాంచల్, భూపాల్ నుంచి జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

సోషల్ మీడియాతోనే వల

రవికుమార్, స్టాక్ బ్రోకర్



వాట్సప్,ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియ ద్వారా కేటుగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారు. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వారు చెప్పే లింకుల్ని క్లిక్ చేయకూడదు. వారు చెప్పే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టకూడదు.



వివాహం ఆడంబరం!

సండే స్టోరీ



రెండు జీవితాలు కలయిక వివాహ బంధం. యుక్త వయస్సు వచ్చిన అమ్మాయి అబ్బాయి కలిసి పయనించడానికి పెద్దలు చూపిన మార్గమే వివాహం. మనసు ఎదిగిన వ్యక్తితో నడవాలని అమ్మాయిలు అనుకూలమైన యువతి కావాలని అబ్బాయిలు భాగస్వామి ఎంపికలో పరిణతితో వ్యవహరిస్తారు. కన్నవారిని కష్టపెట్టకుండా తాము ఇష్టపడ్డవారిని వివాహం చేసుకుంటూ నేటి వ్యవస్థలో అధిక శాతం యువత ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే సమయంలో వివాహ వేడుకల్లో ఆధునిక పోకడలు ఆడంబరంగా మారాయి. జీవితంలో గుర్తుండిపోయేలా వివాహ వేడుకకు స్తోమతుకు మించి ఖర్చు చేస్తున్నారు. ఉన్నత వర్గాల వారి పెళ్లి వేడుక, ఖర్చు అంబరాన్ని అంటుతోంది. మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలతో పాటు పేదింట వివాహ ఆడంబరాలపై ఈ ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. - పాలకొల్లు

- వివాహాలకు మూడేళ్లలో 50 శాతం పెరిగిన ఖర్చు
- కనిష్ఠం రూ.5 లక్షలు.. గరిష్ఠం రూ.30 లక్షలు
- ధనిక వర్గాల ఇళ్లలో పెళ్లి ఖర్చులకు ఎల్లలు లేవు
- ఎగువ, మధ్య తరగతుల్లో పిల్లలదే పెళ్లి పెత్తనం
- పెళ్లి భోజనాల ఖర్చు తడిసిమోపెడు

ఒకప్పుడు వివాహంతో ఆయా కుటుంబాల ఆర్థిక నేపథ్యాల అనుగుణంగా జరిగేది. ఇప్పుడు విపరీత పోకడలతో పేద, మధ్య తరగతుల కుటుంబాలలో పిల్లల వివాహాలు ఆడంబరంగా చేసి అప్పులు పాలవుతున్నారు. కార్మిక వర్గాలలో కనిష్ఠంగా వివాహ ఖర్చు రూ.5 నుంచి 10లక్షలు అవుతోంది. దిగువ మధ్య తరగతి కుటుంబాలలో వివాహానికి రూ.10 నుంచి 15లక్షలు ఖర్చు చేస్తున్నారు. మధ్య తరగతి కుటుంబాలలో రూ.15 నుంచి రూ.20 లక్షలు, ఎగువ మధ్య తరగతి కుటుంబాలలో పెండ్లి ఖర్చు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు అవుతోంది. సంపన్న వర్గాలలో పెళ్లి ఖర్చుకు ఎల్లలు ఉండడం లేదు.

పెళ్లి వేడుక కూడా హోదా..

నేటి ఆధునిక పోకడలలో వివాహం అనేది సాంప్రదాయమే కాకుండా స్టేటస్ సింబల్‌గా మారింది. తమకు నచ్చినట్లు పెళ్లి చేయాలని వధూవరులు కోరుతుంటే తల్లిదండ్రులు వ్యతిరేకించినప్పటికీ చివరకు పిల్లలు అభీష్టం మేరకు వివాహాలు చేస్తున్నారు. గడిచిన మూడేళ్లలో పోలిస్తే వివాహ ఖర్చు 50శాతం పెరిగింది. వివిధ సర్వేలు ప్రకారం ఏటా దేశంలో కోటి పైగా వివాహాలు జరుగుతుంటే రూ.6లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు.

యువతదే ఇష్టం

మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలలో వివాహ ఖర్చులను విశ్లేషిస్తే ఆసక్తికర విషయాలు వెల్లడవుతున్నాయి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాలలో రెండు చేతులా సంపాదిస్తున్న యువత తామే ఖర్చును భరిస్తూ, వివాహ కన్వెన్షన్ సెంటర్లను తీసుకొని దగ్గరుండి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తగ్గేదేలే..

వివాహం, రిసెప్షన్ భోజనాలలో తగ్గేదే లేదంటూ ఖర్చు చేస్తున్నారు. ఉన్నత వర్గాల వివాహ విందు డైనింగ్ రూమ్‌లు కళ్లు చెదిరే హంగులతో ఉంటాయి. పలు రకాల ఖరీదైన పదార్థాలతో విందు సిద్ధం చేస్తారు. పేద వర్గాలలో సైతం జీడిపప్పు లేనిదే వంటకం లేదని పెళ్లి భోజనంలో నిరూపిస్తున్నారు. జీడిపప్పు వినియోగించడంతో ఇప్పుడు కిలో జీడిపప్పు ధర రూ.600 నుంచి రూ.వెయ్యికి పెరిగింది. స్వీటు, హాటు తాహతు మించి ఏర్పాటు చేస్తున్నారు. ఈవిధంగా పేదవర్గాలలో పెళ్లి విందుకు కేవలం ఒక జీడిపప్పుకే 5కిలోలు కొనుగోలు చేస్తే గరిష్ఠంగా సంపన్న శ్రేణులతో 100 కిలోలు జీడిపప్పును వినియోగిస్తున్నారు. విందు సమయంలో ఆహార వృథాను అరికట్టలేకపోతున్నారు. నలుగురూ గొప్పగా చెప్పుకోవాలనే భావనతో స్తోమతను మించి ఖర్చు చేస్తున్నారు.



బంగారం కొనుగోలు

పేద వర్గాలలో పెళ్లి సమయంలో కనిష్ఠంగా రెండు కాసులు, దిగువ మధ్య తరగతి 5 కాసులు, మధ్య తరగతి 10 కాసులు, ఎగువ మధ్య తరగతి 20 కాసులు, సంపన్న వర్గాల్లో 100 కాసులు పైబడి కొనుగోళ్లు చేస్తున్నారు.

ఆనక అప్పులే..!

ఇప్పుడు పేద వర్గాలు మొదలుకొని మధ్య తరగతి స్థాయి వరకూ పెళ్లి వేడుకలు అయిన తర్వాత చిట్టా తీస్తే అప్పులే మిగులుతున్నాయి. రైతువారీ కుటుంబాలలో పొలాలు అమ్మితే ఉద్యోగులు వ్యక్తిగత రుణాలు, వ్యాపారులు ప్రైవేటు అప్పుల వైపు దృష్టి సారిస్తున్నారు. మొత్తంగా నవంబరు, డిసెంబరు నెలల్లో దేశవ్యాప్తంగా జరిగిన, జరుగుతున్న అర కోటి పైబడిన వివాహాలలో 60శాతం పెండ్లి వేడుకలు అప్పులతోనే మిగులుతున్నాయి.

పెరిగిన పెళ్లి ఖర్చు

వివిధ సర్వేలలో వెల్లడైన ప్రకారం గత ఏడాదితో పోలిస్తే ఇప్పుడు 7శాతం వ్యయం పెరిగింది. పెళ్లికి కోటి రూపాయలకు పైగా వ్యయం చేస్తున్నవారు 9శాతం ఉండగా 50లక్షలు పైబడి ఖర్చు చేస్తున్నవారు 18శాతం ఉన్నారు. 60శాతం మంది రూ.25 లక్షలలోపు పెళ్లి వ్యయం చేస్తున్నారు. పెళ్లి ఖర్చులు నిమిత్తం 12 శాతం కుటుంబాలు బంధువులు, స్నేహితులు నుంచి అప్పులు తీసుకుంటున్నారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాల్లో రూ.30లక్షలు ఉండగా ఎగువ మధ్య తరగతి వర్గాలలో రూ.50 లక్షలు పైబడి ఖర్చు చేస్తున్నారు.

అమ్మాయి పెళ్లికి అర ఎకరం అమ్మకం..!

పాలకొల్లు మండలంలోని ఒక గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (పేరు మార్చడమైనది) డిగ్రీ చదివిన తన కుమార్తె వివాహం కాస్త ఆడంబరంగానే చేశారు. రూ.30లక్షలు ఖరీదు చేసే అర ఎకరం పొలం అమ్ముదామంటే సమయానికి బేరాలు రాలేదు. పొలంపై రూ.15 లక్షలు నూటికి రూ.3 చొప్పున అప్పు తెచ్చారు. అప్పు ఇప్పించిన మీడియేటర్‌కు 5 శాతం కమీషన్, అప్పు ఇచ్చిన ఆసామికి భూమి అమ్మినట్టు రిజిష్ట్రేషన్ చేయడానికి రూ.50 వేలు, రెండు నెలల ముందస్తు అడ్వాన్స్ రూ.90వేలు. మొత్తం కలిపి రూ.2.15 లక్షలు మినహాయించుకుని రూ.12.85 లక్షలు సొమ్ము చేతిలో పడింది. పెళ్లి తంతు పూర్తి చేశాక మొదలయ్యాయి వెంకటేశ్వర్లు కష్టాలు. రూ.30లక్షలు ఖరీదు చేసే పొలం కొనే నాథుడు లేడు. అప్పు తీరే మార్గమూ లేదు.

పెళ్లికోసం పర్సనల్ లోన్!

భీమవరం ప్రాంతానికి చెందిన నాలుగో తరగతి ఉద్యోగి కనకారావు కుమార్తె వివాహానికి రూ.10 లక్షలు బ్యాంకులో పర్సనల్ లోన్ తీసుకున్నాడు. ఒకవైపు హౌసింగ్ లోన్ ఈఎంఐ. మరోవైపు పర్సనల్ లోన్ ఈఎంఐ, ఇంకా పెళ్లికి తెచ్చిన చిల్లర అప్పులపై వడ్డీలు వెరసి అనారోగ్యం పాలు చేశాయి. ఇప్పుడు ఆ కుటుంబం తీవ్ర మనోవేదనలో ఉంది. పేద మధ్య తరగతి వర్గాలలో పెండ్లి వేడుకలకు స్థాయికి మించి ఖర్చు చేసి అప్పులు పాలై ఆనక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పుడు జరుగుతున్న కళ్యాణ వేడుకలలో 30శాతం పైబడి వివాహాలు అప్పులతోనే నడుస్తున్నట్లు వివిధ సర్వేలు ద్వారా వెల్లడయ్యింది.

విందు వైభవం



వివాహాలకు నవకాయ వంటకాలతో విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఫొటోగ్రఫీ పెళ్లి మండపం అలంకరణలకే లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. పేద మధ్య తరగతి వర్గాలలో విందు భోజనానికి ప్లేటుకు రూ.200 ఖర్చు చేస్తుంటే ఎగువ మధ్య తరగతి సంపన్న వర్గాలలో ఒక ప్లేటు భోజనానికే రూ.2వేలు ఖర్చు చేస్తున్నారు. ఒకరు పాతిక రకాలు వంటకాలు వడ్డించామంటే మరొకరు 50 పైబడే వంటకాలు వడ్డించామని గొప్పలు చెప్పుకుంటున్నారు. భోజనశాల అలంకరణ కూడా జిగేల్‌మనాల్సిందే. పెండ్లి ఆహ్వాన పత్రికలు సైతం లక్షలు ఖర్చు చేస్తున్నారు. వివాహ పత్రిక వివాహ వేడుక దర్పాను ముందుగానే చాటుతాయి. బహుమతులు అందజేస్తున్నారు. వరుడికి కట్నం ప్రసక్తి మాట ఎలాగున్నా అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు సమాన వాటా డిమాండ్ చేస్తున్నారు.

ప్రి వెడ్డింగ్ షూట్



ఇటీవల గ్రామాలకు చేరువగా ఉన్న పట్టణాలలో సైతం ప్రి వెడ్డింగ్ షూట్ సాధారణం అయింది. వధూవరులకు ఫొటోలు తీయడం మాత్రమే కాదు. ప్రి వెడ్డింగ్ షూట్‌కు ఖర్చుకు వెనకాడడం లేదు. కొన్నిచోట్ల భారీ సెట్టింగ్‌లు వేస్తుంటే.. మరి కొందరు షూటింగ్ నిమిత్తం లక్షలు ఖర్చు చేస్తున్నారు. డ్రోన్ కెమెరాలు వినియోగించి ప్రత్యేక ఫొటోలు, వీడియోలు తీయిస్తున్నారు. ముందుగా వివాహ నిశ్చితార్థం ఖర్చులు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఇక బ్యాచిలర్ పార్టీ, మెహెందీ, పెళ్లి రిసెప్షన్ ఖర్చు సరేసరి. ఇదంతా హోదా చాటుకునే ప్రయత్నమే. సంపన్న వర్గాలు ఎగువ, మధ్య తరగతి వర్గాలలో డెస్టినేషన్ వెడ్డింగ్ పేరుతో విదేశాలలో రిసార్ట్‌లలో వివాహ వేడుకలు నిర్వహిస్తున్నారు. దగ్గరి బంధువులు, స్నేహితులతో వేడుకగా నిర్వహిస్తున్నారు.

స్థాయికి మించి అప్పు చేయవద్దు



వివాహ సమయాలలో ఆయా కుటుంబ పెద్దలు స్థాయికి మించి ఖర్చు చేయవద్దని ఆడిటర్ సూచించారు. పూర్వం పెళ్లంటే బంధు వర్గాలను పిలుచుకుని కొద్దిపాటి వంటకాలతో భోజనాలు పెట్టి నిరాడంబరంగా వివాహాలు చేసేవారు. ఇప్పుడు ఒకరిపై ఒకరు పోటీపడి వందలు వేలసంఖ్యలో ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. ఫంక్షన్ హాళ్లకు లక్షలాది రూపాయలు అద్దె కట్టి ఈవెంట్ పేరుతో చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అనంతరం ఆయా కుటుంబాలు ఆర్థిక సమస్యల్లో కూరుకుపోతున్నారు.

- పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, ఆడిటర్

అధ్యయనం చేయాలి



వివాహ సమయంలో వధూవరుల తరపు పెద్దలు ముందుగా ఖర్చులపై అధ్యయనం చేయాలి. ఇరు వైపుల వారు ఒక ఒప్పందానికి వచ్చి వివాహం జరిపించాలి. పెండ్లి, రిషప్షన్ పేరుతో రెండు పర్యాయాలు లక్షలాది రూపాయలు ఖర్చు చేయకుండా ఒకే వేదికపై వధూవరుల పెద్దలు ఖర్చులు పంచుకోవాలి. అప్పుల జోలికి వెళ్లకుండా స్థాయికి తగ్గట్టుగానే పెళ్లి ఖర్చులు మదింపు చేసుకోవాలి. దంపతులిద్దరూ సంపాదనాపరులైనప్పటికీ పెళ్లి అయిన తర్వాత వారికి సొంత కాపురం ఖర్చులు ఉంటాయి. కాబట్టి పెళ్లి వ్యయాన్ని పిల్లలు భరించే పరిస్థితి ఉండదు. అందుకు పెద్దలే ముందుగా మేల్కోవాలి.

- డాక్టర్ కేశిరాజు రాంప్రసాద్, మానసిక వికాస నిపుణులు



అంతర జిల్లా క్రీడాకారులతో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, నిర్వాహకులు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ క్రీడా పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, అందరూ క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మార్టేరు ఎస్‌వీజీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పదవ అంతర్ జిల్లా సీనియర్ చాంపియన్ పురుషులు, మహిళల బాస్కెట్ బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పితాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్లో రాణించే టాప్ 20 మెంబర్స్‌కు ప్రతి నెల రూ.75 వేలు ఖాతాలో జమ చేస్తుందని, మార్టేరు బాస్కెట్ బాల్ పోటీలతోనే ఇది ప్రారంభంకావడం అభినందనీయమన్నారు. మార్టేరులో మల్టిపుల్ స్పోర్ట్స్ సెమీ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులను దేశంలోనే అగ్రగామిగా చూడాలనే ఉద్దేశంతో స్పోర్ట్స్ అథారిటీ ఆంధ్రప్రదేశ్ పైలెట్ ప్రాజెక్టుగా బాస్కెట్‌బాల్‌ను ఎంపిక చేయడం క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. బాస్కెట్ బాల్ క్రీడల పరిశీలకుడు చెంగల్వరాయుడు మాట్లాడుతూ అనంతపురంలో బాస్కెట్‌బాల్ జాతీయ జట్టు ఎంపిక చేస్తామని, 2026 జనవరి నాటికి మార్టేరులో సెమీ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. స్కూల్ గేమ్స్ సెక్రటరీ చక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని, క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాస్కెట్‌బాల్ యూత్ అధ్యక్షుడు చిర్ల బాలాజీ రెడ్డి, జాతీయ క్రీడాకారుడు సత్తి సుబ్బన్న రెడ్డి ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, కోనాల శ్రీనివా సరెడ్డి, తేతలి రాజారెడ్డి, వెలగల నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఫ్లడ్ లైట్ల వెలుగులో జరిగిన మొదటి మ్యాచ్‌లో కడప, పశ్చిమ గోదావరి జిల్లా మహిళ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీలను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



మంచు ముసుగు

శనివారం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ మంచు కురిసింది. తీరంలోని ప్రధాన రహదారులను మామిడి తోటలను పూర్తిగా మంచు కమ్మేసింది. ప్రధాన రహదారుల్లో ఎదురెదురు వాహనాలు కనబడక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. - మొగల్తూరు



ద్వారకాతిరుమల, పెనుగొండ మండలం వదలిలో కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు, ఏలూరు, భీమవరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు

షష్ఠి సందడి

అత్తిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పుట్టల వద్ద పాలు పోశారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు అత్తిలిలో సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనానికి కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో నాగేంద్రుడికి మహిళలు పూజలు చేశారు. స్వామి వారి ఆశీస్సులతో సంతాన కలిగిన దంపతులు తమ చిన్నారుల శిరస్సుపై నుంచి బూరెలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో జిల్లాలో పలు గ్రామాల వారి కోలాట భజన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తణుకు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో అత్తిలి ఎస్‌స్ పి.ప్రేమరాజు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. షష్ఠి తిరునాళ్లలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్స్, కొలంబస్‌ల వద్ద సందడి నెలకొంది. పలు దుకాణాల వద్ద వస్తుసామగ్రి కొనుగోలు చేసేందుకు మహిళలు బారులు తీరారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు పాలు, తాగునీరు అందజేశారు.

ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆలయంలో ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరుడు, వల్లీ, దేవసేన అమ్మవార్ల కల్యాణ మూర్తులకు ఆలయ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు. అర్చకులు, పండితుల వేదమంత్రోచ్చరణ నడుమ మాంగల్యధారణ, తలంబ్రాలు వేడుక భక్తులకు కన్నుల పండువైంది. ఏలూరు నగరం, భీమవరం పట్టణాల్లో షష్ఠి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కైకరం ఆలయంలో శనివారం తెల్లవారుజామున కల్యాణం జరిగింది. ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలో ప్రత్యేక పూజలు చేశారు.



భీమవరం పట్టణం, ఏలూరు నగరం ఆలయాల్లో పాలు సమర్పిస్తున్న భక్తులు, కలిదిండి మండలంలో పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు



భీమవరం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్‌లో భక్తులు



ఏలూరులోని ఆలయంలో పండ్లు సమర్పిస్తున్న భక్తులు



ఏలూరు ఆలయంలో బారులుదీరిన భక్తులు



అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం వద్ద కోలాట భజన



ఉండి ఆలయంలో మహిళల కోలాట ప్రదర్శన



గణపవరం ఆలయం వద్ద కోలాటంతో చిన్నారుల సందడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

15న పాలకొల్లులో సేవ్ ద గర్ల్ చైల్డ్ '2కే రన్'

▸ మంత్రి నిమ్మల రామానాయుడు ▸ ముఖ్యఅతిథిగా హోంమంత్రి అనిత రాక

పాలకొల్లు టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : 'ఆడ పిల్లలను రక్షించుకుందాం.. భ్రూణ హత్యలు నిర్మూలిద్దాం.. దాడులు, అత్యాచారాలు, హత్యలను అరికడదాం' అనే నినాదంతో పాలకొల్లులో ఈనెల 15న సేవ్ ద గర్ల్ చైల్డ్ 2కె రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం స్థానిక క్లాత్ మర్చంట్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న అనేక చైతన్య కార్యక్రమాల్లో భాగంగా ప్రతీ రెండేళ్లకొకసారి ఈ సేవ్ ద గర్ల్ చైల్డ్ 2కె రన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగానే ఈనెల 15న స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద సభా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హాజరవుతారన్నారు. కలెక్టర్ సి.నాగరాణి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కాట ఆమ్రపాలి, గాయకురాలు మధుప్రియ, బ్రహ్మముడి సీరియల్ నటి దీపిక రంగరాజన్, తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో కృష్ణాజిల్లా టీజేపీ ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, టీజేపీ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నాక్ ఏ ప్లస్ గ్రేడ్ ప్రకటించిన పత్రాలతో గోకరాజు వెంకటనరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు

డీఎన్నార్ డిగ్రీ కళాశాలకు 'నాక్ ఏ ప్లస్' గ్రేడ్

భీమవరం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : డీఎన్నార్ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ దక్కిందని కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతనెల 28, 29 తేదీల్లో నాక్ పీర్ సభ్యుల బృందం కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్య, కాలేజీలో మౌలిక వసతులు వంటి వాటిని పరిశీలించి సంతృప్తి చెందడంతో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ కేటాయించిందన్నారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమ కళాశాలలో చదివే విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల్లో విద్యనభ్యసించేందుకు ట్విన్నింగ్ ప్రోగ్రామ్ ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. అనంతరం కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడారు. ప్రిన్సిపాల్ జిమోజెస్, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణంరాజు, చిరుకూరి కుమారదత్తాత్రేయవర్మ పాల్గొన్నారు.

15న యూత్ హాస్టల్స్ జాతీయస్థాయి సమ్మేళనం



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : 'యువతకు పట్టుదల, ఆత్మవిశ్వాసం పెరగడానికి, విద్య జీవన నైపుణ్యాలు పెరగడానికి యూత్ హాస్టల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని, యూత్ హాస్టల్స్ చేస్తున్న కార్యక్రమాలు భేష్' అని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో యూత్ హాస్టల్స్ కోసం జూబ్లీ జాతీయస్థాయి సమ్మేళన క్యాలెండర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మంచి కార్యక్రమాలు చేయడం ద్వారా యూత్ హాస్టల్స్ భీమవరం యూనిట్ దక్షిణ భారతదేశంలో అతిపెద్ద యూనిట్‌గా గుర్తింపు తెచ్చుకుందన్నారు. యూనిట్ చైర్మన్ ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి నందమూరి రాజేష్ మాట్లాడుతూ యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ వారి 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 15న త్యాగరాజు భవనంలో జూబ్లీ జాతీయస్థాయి యూత్ హాస్టల్స్ సభ్యుల సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. పది రాష్ట్రాల నుంచి 200 మంది సభ్యులతోపాటు భీమవరం యూనిట్ సభ్యులు అభిమానులు పాల్గొనాలని కోరారు. యూనిట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆరేటి వెంకట సత్యనారాయణ, జూబ్లీ కో-ఆర్డినేటర్ బోనం పాండురంగారావు, తాళ్లపూడి గాంధీ పాల్గొన్నారు

832 కేసులు.. రూ.14.92 లక్షల అపరాధ రుసుం

▸ ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్



మోటారు వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ఏలూరు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో కొనసాగుతున్న రవాణాశాఖ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారులు 832 కేసులు నమోదు చేశామని జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. డిసెంబరు ఒకటో తేదీ నుంచి శనివారం వరకు పలు రకాల వాహనాలపై పలు ఉల్లంఘనలకు గాను 832 కేసులు నమోదు చేసి 14 లక్షల 92 వేల రూపాయలను అపరాధ రుసుము విధించామన్నారు. ఇన్సూరెన్సు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై 411 కేసులు నమోదు చేసి 4 లక్షల 11 వేల రూపాయలను అపరాధ రుసుము విధించామన్నారు. విద్యా సంస్థల బస్సులపై 23 కేసులు నమోదు చేసి లక్షా 15 వేల రూపాయలు, నిబంధనలు పాటించని సరుకు రవాణా వాహనాలపై 82 కేసులు చేసి 4 లక్షల 92 వేల రూపాయలను అపరాధ రుసుముగా విధించామని తెలిపారు. వీటితో పాటుగా పలు రకాల వాహనాలపై 316 కేసులు నమోదు చేసి 4 లక్షల 74 వేల రూపాయల అపరాధ రుసుము విధిం చామన్నారు.

క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి రూ.150 కోట్లు



క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణంకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పార్థసారథి

▸ మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి రూ.150 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయిం చిందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం నూజివీడు ఎంఆర్ అప్పారావు కాలనీ లో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మందిరాల నిర్మాణం ద్వారా ప్రశాంతమైన వాతావరణంలో భగవంతుడిని స్మరించుకునే అవకాశం కలుగు తుందన్నారు. దీనిలో భాగంగా రూ.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

'తొలగింపు'లో తొందరపాటు ?!

▸ నియామకాల్లో అక్రమాలను కప్పిపుచ్చేందుకే ఇతర ఉద్యోగులపై వేటు ?
▸ ఉమ్మడి జిల్లాలో ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగుల టెర్మినేషన్‌లో కొత్తకోణం
▸ మౌనముద్రలో వైద్య ఆరోగ్యశాఖ.. ఆందోళనలో ఉద్యోగులు



ఏలూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కొద్దిరోజులుగా ప్రకంపనలు పుట్టిస్తోన్న 111 మంది కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగుల టెర్మినేషన్ ఉత్తర్వుల జారీలో డీఎంహెచ్‌వో కార్యాలయం ఒకింత తొందరపాటుగా వ్యవహరించినట్టుగా సంకేతాలు వస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఈ రిక్రూట్‌మెంట్‌లో రెండు జీవోల ప్రకారం నియామకాలను చేపట్టగా, వీటిలో కోర్టు కొట్టివేసిన జీవో 1207 పరిధిలోకి ఉమ్మడి జిల్లాలోని ఏడుగురు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగులను చేర్చడంతోపాటు, వారిని విధులనుంచి తొలగిస్తూ డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు, ఉద్యోగులు తప్పిదాలకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే టెర్మినేషన్ ఆర్డర్లు జారీ అయిన ఉద్యోగులు లక్ష్మయ్య, చిన్నయ్య, నాగన్న, చిరంజీవి, రాజు, మునేశ్వరరావు, శ్రీను తాము జీవో 273లో నియామక ఉత్తర్వులు పొందినప్పటికీ అన్యాయంగా జీవో 1207లోకి చేర్చి విధుల తొలగింపు ఆదేశాలు జారీచేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళగా, జరిగిన లోపాన్ని సరిదిద్దకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాగా రెండురకాల జీవోలను అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా ఇటీవల వరకు నియామకాలు జరిపిన కార్యాలయ సూపరింటెండెంట్ స్థాయి అధికారులు, సీనియర్ అసిస్టెంట్‌లలో ఒకరు ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యి అదే కేడర్‌లో ఉద్యోగం చేస్తున్నట్టు తెలుస్తోంది. మరొకరు ఇప్పటికీ డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే విధులు నిర్వర్తిస్తుండగా, గతంలో వీరిద్దరూచేసిన అక్రమాలు బహిర్గతం కాకుండా ఉండేందుకే అప్పటి నియామకాల ఫైళ్ళను కనబడకుండా చేయడం, వివరాలను తారుమారు చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తం నియామకాలపై కలెక్టర్ నేరుగా శాఖాపరమైన విచారణ చేయిస్తే లొసుగులు బయటకు రావడంతోపాటు, అన్యాయంగా తమకు జారీచేసిన టెర్మినేషన్ ఆర్డర్లను వెనక్కితీసుకుని న్యాయం చేసినట్టవుతుందని ఏడుగురు అభ్యర్థుల వాదనగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగులకు జారీచేసిన టెర్మినేషన్ ఉత్తర్వుల గందరగోళంపై ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావుని ఫోన్‌లో వివరణ కోరగా 'తర్వాత మాట్లాడతా'నన్నారు.

మా కష్టార్జితం మింగేశారు

▸ మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి ఎదుట లంక గ్రామస్థుల ఆందోళన
▸ వంటావార్పుతో రెండోరోజు నిరసన



మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి ఎదుట బైఠాయించిన లంక గ్రామాలవాసులు

పెదవేగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మా కష్టార్జిత సొమ్ము మింగేశారని, మా డబ్బులు ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని లంక గ్రామాల వాసులు డిమాండ్ చేశారు. కొండలరావుపాలెంలోని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి దగ్గర కొమటిలంక, శ్రీపర్రు గ్రామస్థుల ఆందోళన రెండోరోజు శనివారం కొనసాగింది. గ్రామస్థులు వంటావార్పుతో నిరసనను తెలిపారు. వైసీపీ నాయకుడు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావు కలిసి మా కష్టార్జితం సొమ్మును మింగేశారన్నారు. ఆ రెండు గ్రామాలకు చెందిన దాదాపు 200మంది శనివారం కొండలరావుపాలెంలోని కొఠారు ఇంటికి చేరుకుని నిరసన తెలిపారు. ఆ సమయంలో వైసీపీ నాయకులు లంక గ్రామస్థులకు మధ్య ఒకింత ఘర్షణ వాతావరణం నెలకొంది. మా నాయకుడి ఇంటి ఎదుట వంట చేయడానికి వీల్లేదని కొఠారు అనుచరులు అడ్డుకున్నారు. మీ ఇంటిలోకి రాలేదు, రోడ్డుపై శాంతియుతంగా నిరసన వ్యక్తంచేస్తున్నాం. అడ్డుకోవాలని చూస్తే ప్రతిచర్య తప్పదని హెచ్చరించడంతో వైసీపీ నాయకులు వెనక్కి తగ్గడంతో నిరసన కొనసాగించారు. ఆయా గ్రామస్థులు నేతల రవి, నంబూరి నాగరాజు, ఘంటసాల శ్రీహరి, హరికృష్ణ, రామ్ ప్రసాద్, సైదు కృష్ణ తదితరులు మాట్లాడుతూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చెరువులు తవ్వుకున్నామని, 2019లో ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన అబ్బయ్యచౌదరి దౌర్జన్యంగా చేపల చెరువుల లీజు సొమ్మును తన వద్దే పెట్టుకుని మా అందరి పొట్టమీద కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మా కష్టార్జితం సొమ్ము దిగమింగిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావుల్లో ఒకరు దేశం విడిచి పోగా, మరొకరు రాష్ట్రం విడిచి పోయారన్నారు. ఐదేళ్ళగా కాజేసిన సొమ్మును వడ్డీతో సహ కక్కిస్తామని హెచ్చరించారు. గ్రామంలో ఇరువర్గాల చేరికతో ఎటువంటి ఘర్షణ జరుగకుండా నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ.ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నలుగురు ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.



జీలుగుమిల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి, ఎన్‌హెచ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది

హైవే విస్తరణలో గ్రామస్థులు నష్టపోకుండా చూస్తాం

▸ ఏలూరు జిల్లా జేసీ ధాత్రిరెడ్డి

జీలుగుమిల్లి, డిసెంబరు, 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణలో జీలుగుమిల్లి గ్రామస్థులు నష్టపోకుండా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పిస్తామని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. జీలుగుమిల్లి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామస్థులతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణలో పట్టా భూమి కోల్పోయే రైతులతో మాట్లాడుతూ భూమికి, అందులో ఉన్న నిర్మాణాలకు తగిన నష్టపరిహారం చెల్లించే విషయమై మాట్లాడారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. స్థానిక జగదాంబ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల నిర్మాణంలో స్థానికులతో చర్చించి స్థల సేకరణ కోసం చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ స్లీవజోజికి చెప్పారు. స్థానికుల్ని సంప్రదించి స్థలసేకరణ జరుపుతామన్నారు. ఏజెన్సీలో ఉన్న భూమిని కోల్పోయి ఇచ్చిన నష్ట పరిహారంతో బయట మైదాన ప్రాంతంలో స్థలం కొనుక్కోలేమని, ఇక్కడ ఉన్న వాటిని వదులుకుని బయటకు వెళ్లలేమని, ఆలయాలు రెండు రోడ్డు విస్తరణలో పోకుండా బైపాస్ వచ్చేలా చూడాలని ఉన్న కొద్ది సెంటరు పోతే స్థానికులు ఉనికి కోల్పోతామని ఆమె ఎదుట గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత వరకు అందరికి న్యాయం జరిగేలా నష్టపరిహారం మూడు రెట్లు వచ్చేలా చూస్తామని జేసీ స్పష్టం చేశారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు దోహదం



మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణరాజు

ఏలూరు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కోర్టులలో కేసులు పెండింగ్ విపరీతంగా పెరిగిపోయాయని వీటిని త్వరితగతిన పరిష్కరించడం కోసం మధ్యవర్తిత్వ కేంద్రాలు దోహదం చేస్తాయని ఏలూరు జిల్లా ఏడో అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో శనివారం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్ 89 సీపీసీ ప్రకారం కేసులను మధ్యవర్తిత్వ కేంద్రాలకు రిఫర్ చేయడం, రిఫర్ చేసే విధి విధానాలు, కేసుల రాజీకి అనుకూలమైన పరిస్థితులు, న్యాయవాదుల పాత్ర న్యాయసేవాధికార సంస్థ చేత నియమించబడిన శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా మధ్యవర్తిత్వ కేంద్రాలల్లో కేసుల పరిష్కారాలపై న్యాయవాదులకు అవగా హన కల్పిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా ఇటు న్యాయమూర్తులతో పాటు న్యాయవాదులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్, బార్ అసోసియేషన్ సెక్రటరీ చింతమనేని రమేష్, న్యాయసేవాధికార సంస్థ సభ్యులు అబ్బినేని విజయ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు

లింగపాలెం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): సింగగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఓ బాలునికి ప్రమాదవశాత్తు నోటిలో పుల్ల గుచ్చుకోవడంతో తీవ్రగాయమై రక్తస్రావమైంది. తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్త బాలుడిని వెంటనే చింతలపూడిలోని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తీసుకు వెళ్లారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకురాగా చింతలపూడి ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో మాధవి బాలుడిని పరామర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలుడి ఆరోగ్యం మెరుగయ్యేవరకు జాగ్రత్తగా చూసుకోవాలని ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పోలవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడిన సంఘటన పోలవరంలో శనివారం జరిగింది. పోలవరం పంచాయతీ బీసీ కాలనీకి చెందిన కంబాల దుర్గారావు, లక్ష్మి దంపతులు బ్యాంకు పనిమీద మోటారుసైకిల్‌పై వెళుతుండగా స్థానిక బస్ కాంప్లెక్స్ సమీపంలో ఇటుకల కోట వైపు నుంచి వస్తున్న ఆటో ఢీ కొనడంతో గాయాల పాలయ్యారు. స్థానికులు గాయపడిన వారిని పోలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం వారిని రాజమహేంద్రరంలోని ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ దాడులు.. ఇద్దరి అరెస్ట్

చాట్రాయి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం గ్రామంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు జరిపిన దాడులలో ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ నల్ల బెల్లం విక్రయించే వ్యాపారులపైనా, బెల్లం ఊట కలిగిన భూ యజమానులపై కేసులు నమోదు చేస్తున్నామని సీఐ చెప్పారు.

మహిళపై కేసు

చింతలపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిగూడెంలో సారా స్థావరాలపై దాడులు జరిపి భూక్యా దశలి అనే మహిళపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. శనివారం గ్రామంలో దాడులు నిర్వహించామని, ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆమె నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎస్‌ఐలు నరసింహారావు, ఖలీల్ పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి.. ఆరుగురి అరెస్టు

ఆచంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆచంట మండలం అయోధ్య లంకలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ కె.వెంకట రమణ తెలిపారు. శనివారం గ్రామంలో కోడి పందేలు వేస్తున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.6,250 నగదు స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు

క్రైమ్ కార్నర్

రైలు ఢీకొని ఒకరి మృతి

భీమవరం క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ పీటీవీ రమణ తెలిపిన వివరాలివి.. పాలకోడేరు మండలం శృంగవృక్షం గేటు సమీపానికి చెందిన యమలవలస అశోక్ కుమార్ (35) శనివారం ఉదయం రైలు వస్తుందని చూడకుండా శృంగవృక్షం సమీపంలో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీ కొట్టింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. భీమవరం జంక్షన్ స్టేషన్ మాస్టర్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. అతడికి సంబంధించిన బంధువులు హైదరాబాద్ నుంచి వస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఏలూరు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెంనకు చెందిన పిన్నిబోయిన కృష్ణబాబు(29) భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. జీవితంపై విరక్తి చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి శుక్రవారం పాల్పడ్డాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

రూ.18.73 లక్షల బంగారు ఆభరణాల అపహరణ

▸ పని మనిషిపై అనుమానం.. పోలీసులకు ఫిర్యాదు

ఏలూరు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తల్లి ఆరోగ్యం బాగోలేదని ఒక మహిళను ఆమెకు సహాయకారిగా ఇంట్లో అన్నిపనులు చేసేందుకు పెట్టారు. ఆ ఇంట్లో లక్షలాది రూపాయలు విలువైన బంగారు ఆభరణాలు అపహరణకు గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరు శాంతినగర్‌కు చెందిన యర్రంశెట్టి సురేష్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అతడి తల్లి అనారోగ్యంగా ఉండడంతో ఒక మహిళను ఆమెకు సహాయకారిగా, ఇంట్లో అన్ని పనులు చేసేందుకు పెట్టుకున్నారు. గతనెల 30న ఇంట్లోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. అప్పటినుంచి అవి వెతికినప్పటికీ కనిపించకపోవడంతో ఆ మహిళే అపహరించి ఉండవచ్చని పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన బంగారు ఆభరణాలు 322.50 గ్రాములని వాటి విలువ 18 లక్షల 73 వేల 500 రూపాయలు అని పేర్కొన్నారు. ఈ ఘటనపై త్రీటౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ పి.రాంబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరుగుడు తోట నరికిన ముగ్గురిపై కేసు

మొగల్తూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తన మూడు ఎకరాల సరుగుడు తోటలోకి అక్రమంగా ప్రవేశించి చెట్లు నరికేశారంటూ బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. మోళ్ళపర్రు గ్రామానికి చెందిన తిరుమాని శ్రీను అనే వ్యక్తికి గల మూడు ఎకరాల సరుగుడు తోటలోకి అదే గ్రామానికి చెందిన కర్రి ఏసుబాబు, శంకరపు శ్రీను, అండ్రాజు మోహనరావు అక్రమంగా ప్రవేశించి సరుగుడు మొక్కలు నరికేశారన్నారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురు వ్యక్తులపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దాడి చేశారంటూ ఇరువర్గాల ఫిర్యాదు

భీమవరం క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తనపై అన్యాయంగా ఓ వ్యక్తి బీరు సీసాతో దాడి చేశారంటూ నాచువారి సెంటర్‌కు చెందిన అధికారి వాసు అనే వ్యక్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 6వ తేదీన సాయంత్రం తన స్నేహితులతో బేతనీపేటలో క్రికెట్ ఆడుతుండగా పక్కన ఎవరో గొడవ పడుతున్నారని, అక్కడకు వెళ్ళేసరికి కోయవారి వీధికి చెందిన చోడిశెట్టి సాయితేజ అనే వ్యక్తి ఇక్కడకు ఎందుకు వచ్చావు అంటూ బీరు సీసాతో తలపై కొట్టి గాయపర్చడంతో భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా తనపై అధికారి వాసు, దుర్గారావు, మోహన్, సురేష్ అనే వారు చేతులతో కొట్టి కాళ్లతో తన్ని దాడి చేసినట్టు చోడిశెట్టి సాయితేజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కాళ్ళ శ్రీను తెలిపారు.

65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

భీమవరం క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిల్వ ఉంచిన 65 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఏలూరు) అధికారికి భీమవరం పట్టణంలో పలుచోట్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో దాడులు చేశారు. పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన మద్ది వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి 65 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని గోనె సంచుల్లో అక్రమంగా నిల్వ ఉంచడంతో దాడి చేసి అతడిని అధికారులు ప్రశ్నించారు. భీమవరం పరిసర ప్రాంతాల్లో కిలో రూ.15కు కొనుగోలు చేసి వాటిని సమీప ప్రాంతాల్లో ఉన్న చేపల చెరువులకు కిలో రూ.22కు విక్రయిస్తానని తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.2.60 లక్షల విలువైన బియ్యం, రూ.5 వేలు విలువైన కాటా, రూ5 వేలు విలువైన కుట్టు మిషన్‌ను సీజ్ చేసి అతడిపై సుబ్బయ్యపై నిత్యావసరాల చట్టం కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, సీఎస్‌ఆర్‌ఐ సురేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు హర్షణీయం : ఎంపీ పుట్టా



మోదీకి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహుకరిస్తున్న ఎంపీ మహేష్

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర క్యాబినేట్ ఆమోదం తెలపటంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రధాని మోడీని ఎంపీ మహేష్‌కుమార్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 250మంది విద్యార్థులు కేంద్రీయ విద్యాలయంలో చదువుకునే అవకాశం లభిస్తుందని ఎంపీ అన్నారు.

● లింగపాలెం : రాష్ట్రానికి కేంద్రీయ విశ్వ విద్యాలయాల మంజూరు చేయడం ఎంతో హర్ష ణీయమని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిశోర్ అన్నారు. మఠంగూడెంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు ఆర్.చక్రధరరావు ఆధ్వర్యంలో సమా వేశం నిర్వహి ంచారు. కేఎస్‌వీ ప్రసాద్, కె.శివన్నారాయణ, టి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

జూదాల జోలికి పోవొద్దు

చింతలపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జూదాల జోలికి పోవద్దని జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూదం వ్యసనమేకాదు నేరాలకు దారి తీస్తుంద న్నారు. ఇటీవల ఒక కేసులో ఆరా తీస్తే 31 దొంగ తనాల్లో 47 లక్షలు బయటపడ్డాయని, నేరస్తులను ప్రశ్నిస్తే జూదం ఆడడానికి దొంగతనం చేశామని చెబుతున్నారని, అంటే జూదం ఏదో సరదా అని వెళ్తే దొంగతనాల స్థాయికి తీసుకువెళ్తుందని వాటి జోలికి వెళ్ళవద్దన్నారు. జూదాలకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకుని ఇటువంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని, అందుకే ఈ వ్యసనాలకు లోనుకావద్దని హెచ్చరించారు.

నూతన వంగడాలపై సూచనలు

ఏలూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దాళ్వాకు అనుకూలంగా ఉండే సన్న రకాలు, నూతన వంగడాల గురించి సాంకేతిక పరమైన సూచనలు అందజేయాలని వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ భాషా అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా విద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రం, ఏలూరు జిల్లా వ్యవసాయశాఖ సంయుక్తంగా జిల్లా వనరుల కేంద్రంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయరాయి వ్యవసాయ పరిశోధన సంస్థ అధిపతి కె.మోహనరావు, జేడీ హబీబ్ బాషా, వనరుల కేంద్రం ఏడీ శైలజ, తదితరులు పాల్గొన్నారు. వరి వంగడాలు మినుము, పెసరలలో వంగడాలు, మొక్కజొన్నలో కత్తెర పురుగు, వివిధ పంటల్లో తెగుళ్ళకు సంబంధించి డాక్టర్ కె.ఫణికుమార్ వివరించారు.

కృషి, పట్టుదల అవసరం

ఏలూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే కృషి, పట్టుదల అవసరమని మాతృదేవోభవ సేవా ట్రస్టు చైర్మన్ కృష్ణమోహనరావు, కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. హైదరాబాద్‌లో ఐఏఎస్ లక్ష్యంగా బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జగ్గవరపు ప్రవల్లికకు ఐఏఎస్ శిక్షణకు రూ.80 చెక్కును అందజేశారు. పి.భాస్కరరామం, ఎ.నిర్మల, వి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హస్త కళల్లో రాణించాలి

చింతలపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు హస్తకళల్లో రాణించాలని హస్తకళ సేవా కేంద్రం విజయవాడ సహాయ డైరెక్టర్ అపర్ణలక్ష్మి అన్నారు. స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్లో కళాకారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హస్తకళలతో గామీణ ప్రాంతాల్లో మహిళలకు అందిస్తున్న ఈ అవకాశాన్ని అందిపుచుకోవాలన్నారు. కన్సల్టెంట్ సుధీర్‌కుమార్, ఎస్.కె.ఆజాద్, జయానంద్, టి.జరూష్, సత్యవేణి మాట్లాడారు.

పిల్లల సంక్షేమమే లక్ష్యం కావాలి

పెదవేగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్ర అన్నారు. పెదవేగి మండలం ముండూరు పంచాయతీ వెంగంపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని రాజేంద్ర శనివారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. అదనపు సీడీపీవో ఎంఎస్ రాజశేఖర్, పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఏలూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై అఘాయిత్యాలు-చట్టపరమైన శిక్షలు అనే అంశంపై శనివారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో సదస్సు నిర్వహించారు. సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ బాలికలు, యువతులు, మహిళలు అకృత్యాలకు గురవడానికి దారితీస్తున్న నేర అంశాలను విశ్లేషించారు. వాటినుంచి బాధితులు రక్షింపబడవచ్చే చట్టాలగురించి వివరించారు. డాక్టర్ లక్ష్మీ అగర్వాల్, జిల్లా బాలికా సంరక్షణాధికారి సూర్యచక్రవేణి, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ముత్తయ్య

టి.నరసాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎం.ముత్తయ్య ఎంపికయ్యారు. టి.నరసాపురంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత వి.సిద్ధూ మాదిగ మట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బి.రాజేశ్వరరావు మాదిగ, రాష్ట్ర కార్యదర్శి పిఎలీషా మాదిగ ఆధ్వర్యంలో ముత్తయ్యను ఎంపిక చేశామన్నారు.అలాగే మండల అధికార ప్రతినిధిగా ఎన్.మాదిగను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.






పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో పాల్గొన్న పెదపాడు మండలం వట్లూరులో ఎమ్మెల్యే ప్రభాకర్, ఏలూరులో ఎమ్మెల్యే చంటి, జీలుగుమిల్లి ఏపీ గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే బాలరాజు, కొవ్వలిలో తపన చౌదరి

పండుగలా ఆత్మీయ సమావేశాలు

● ఏలూరు టూ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్‌డేకి ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య(చంటి) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రు లకు ఆటల పోటీలు నిర్వహించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశా రు. హెచ్ఎం సునీత, రిటైర్డ్ హెచ్ఎం వీరభద్రరావు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి, శనివారం పేట, తదితర పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో పలు పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో వి.శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: ఏలూరు సెయింట్ థెరిస్సా హైస్కూలులో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ వాతావరణంలో నిర్వహించారు. మొబైల్స్‌ను పిల్లలకు ఇవ్వడం వల్ల అనర్థాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఏదైనా ఆపద సమయంలో అత్యవసరంగా పోలీస్ సహాయం కావాలంటే వెంటనే 112కు కాల్ చేయాలని సూచిం చారు. హైస్కూలు కరస్పాండెంట్ సిస్టర్ సునీలారాణి, హెడ్ మిస్ట్రీస్ కెజశాంతమ్మ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం:స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ సమావేశం జరిగింది. అమెరికా నుంచి జూమ్ మీటింగ్ ద్వారా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పలు సూచనలు చేశారు. మున్సిపల్ చైర్మపర్సన్ బత్తిన నాగ లక్ష్మి, హెచ్ఎం కేఎస్‌వీ లోవకుమారి, డీఎస్పీ రవిచంద్ర, తహసీ ల్దారు కె.స్లీవజోజి, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, తదితరు లు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమావేశానికి ఆర్డీవో ఎంవీ రమణ, అశోక్ నగర్ ప్రాథమిక పాఠశాల సమావేశానికి చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, శ్రీనివాస పురంలో జరిగిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డీఎస్ చంద్రశేఖ, చక్రదేవరపల్లి లోని ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

● పెదపాడ :వట్లూరు హైస్కూల్లో పేరెంట్స్, టీచర్స్ సమా వేశంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. తొలుత సేతుమాధవ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2.20 లక్షలతో ఏర్పాటు చేసిన సైకిల్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించి దాతలు వేదగిరి నరసింహారావు, కాట్రగడ్డ రేణుకిరణ్‌లను సన్మానిం చారు. హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : బర్రింకలపాడు ఏపీ గిరిజన బాలుర గురుకుల పాఠశాల్లో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ స్వామి, పి.రాము, డీఎల్‌పీవో రజావుల్లా, ఈవోపీర్డీనిఖిల్, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.మంగ పాల్గొన్నారు.

● దెందులూరు :కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం శర్మ ఆధ్వర్యంలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో తపన సంస్థల చైర్మన్ బిజేపీ రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతా రామంజనేయచౌదరి పాఠశాల క్రీడామైదాన అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం ప్రకటించారు.

● ఉంగుటూరు : మండలంలోని 66 పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఎంపీడీవో జి.రా జ్ మనోజ్, ఇన్‌చార్జి తహసీల్దార్ వై.పూర్ణచంద్ర ప్రసాద్ విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● లింగపాలెం :ప్రతి విద్యార్థి చక్కగా చదువుకోవాలని తల్లిదండ్రులు వారిని ప్రతినిత్యం గమనిస్తూ ఉండాలని ఎంఈవో కె.రామారావు అన్నారు. సింగగూడెం పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ నజీముల్లాషా, తదతరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : స్థానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో మొదటి స్థానం పొందితే రూ.10 వేలు ఇస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వ రరావు, ద్వితీయ స్థానం వస్తే రూ.5 వేలు ఇస్తానని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్ ప్రకటించారు. అమరవరం, కస్తూరిబాబ, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీతారామనగరం లోని పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు కోరారు. ఎంపీడీవో నరసింహ రావు, ఎంఈవో గిరిభగవాన్ దాస్, కూటమి నాయకులు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

● పెదవేగి : విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారి ఉన్నతే లక్ష్యంగా ప్రతిఒక్కరూ తమవంతు భాగస్వా మ్యాన్ని అందించాలని పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని 75 పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణను రంగురంగుల రంగవల్లులు, పూలతో అలంకరించి, తల్లిదండ్రులకు స్వాగతం పలికారు.

● చింతలపూడి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పలువురు అధికా రులు పాల్గొన్నారు. తల్లిదండ్రులకు తగ్గావార్ పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఎండీ షరీఫ్, సమగ్ర శిక్ష ఎఎల్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ జి.రాధాకృష్ణ, మధ్యాహ్నబోజన పర్యవేక్షకులు గౌస్, మునిసిపల్ కమిషనర్ పావని, జడ్పీటీసీ నీరజ, ఎంపీపీ రాంబాబు, తదితరు పాల్గొన్నారు. ప్రగడవరం హైస్కూలులో మాజీ ఎంపీటీసీ రాజశేఖరరెడ్డి, పి.చంద్రశేఖ రరెడ్డి, గ్రామ కూటమి నాయకులు, శెట్టివారిగూడెంలో కూటమి నాయకులు ఆర్.జగన్, రాఘవాపురంలోమండల టీడీపీ అధ్యక్షు డు వెంకట్రామయ్య పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల : జి.కొత్తపల్లిలోని జడ్పీ సంస్కృతోన్నత పాఠశాలలో ఆర్.రాంబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలన్నారు.

● టి.నరసాపురం :మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ జరిగింది. ఎస్.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎన్.శిరీష, గోపాలరావు పాల్గొన్నారు.

ఆటలపై విద్యార్థులు ఆసక్తి చూపాలి : కలెక్టర్

దెందులూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చదువులో పోటీ పడటంతో పాటు ఆటలపై కూడా విద్యార్థులు ఆసక్తి చూపాలని ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. దెందులూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. దెందులూరు బాలసదనంలోని చిన్నారులను కలెక్టర్ వెట్రిసెల్వి పాఠశాలకు తీసుకు వచ్చారు. వారందరి తరఫున కలెక్టర్ తల్లి స్థానంలో పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొని మా పిల్లలు ఏలా చదువుతున్నారని టీచర్లను అడిగి తెలుసు కున్నారు. వారి విద్యా ప్రగతిని కలెక్టర్ పరిశీలించారు. పిల్లల కార్డులపై తల్లిదండ్రుల స్థానంలో కలెక్టర్ సంతకం చేశారు. బాలికోన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌లో పిల్లల ఆట పాటలను చూసి కలెక్టర్ మురిసిపోయారు. అనంతరం గ్రామం లోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీఈవో వెంకటలక్ష్మి, డీసీపీవో సూర్యచక్రవేణి, హెచ్ఎం పి.శ్రీదేవి,



వట్లూరులో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

దెందులూరు తహసీలార్ సుమతి, బాలసదనం సూపరింటెండెంట్, సీడీపీవో విజయలక్ష్మి, సెక్టార్ సూపర్ వైజర్ చిట్టమ్మ, డీఈవో వెంకటలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు

● పెదపాడు : వట్లూరులోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనంలో కలెక్టర్ వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. అనంతరం కలపర్రులో పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తాం : జేసీ

బుట్టాయగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో మెరుగైన వసతులను కల్పించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కేఆర్‌పురం ఐటీడీఏ పీవో, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పిల్లలకు అర్థమ య్యే రీతిలో విద్యాబోధన జరిగితే వచ్చే ఫలితాలు వస్తాయన్నారు. బుట్టాయగూడెం జడ్పీ హైస్కూలు, లంకపాకల పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పులిరాముడుగూడెం, రాజానగరం, నూతిరామన్నపాలెం తదితర పాఠశాలల్లో జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ల్లో పాల్గొన్నారు. ఎంపీడీవో కె.జ్యోతి, తహసీల్దార్ సిహెచ్ చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

జేసీ రావాలని ధర్నా

కేఆర్ పురం ఐటీడీఏ పీవో, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వచ్చి సమస్యలను పరిష్కారించాలని విప్పలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో తల్లిదండ్రులు పట్టుబట్టారు. మీటింగ్ కార్యక్రమాన్ని బహిష్కరించి పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులను సరిగా చూడటంలేదని, పిల్లలచేతనే పనులు చేయిస్తున్నారని, అనారోగ్యం పాలైన సక్రమంగా చూడటంలేదని తల్లిదండ్రులు మీటింగ్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీ వస్తారని అధికారులు ముందుగా తెలిపినా.. చివరకు జేసీ రావడంలేదని తెలుసుకుని తల్లిదండ్రులు జేసీ వచ్చేవరకు ఇక్కడే ఉంటామనడంతో విషయాన్ని అధికారులు జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. తాను మరోసారి వస్తానని ఫోన్‌లో తల్లిదండ్రులకు తెలపడంతో శాంతించారు.

విద్యార్థులు బాధ్యతగా ఉండాలి : ఎస్పీ

చింతలపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సమాజంలో బాధ్యతగా ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అన్నారు. స్థానిక సుబ్బరాజు హైస్కూలులో మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సమావేశంలో హైస్కూల్ హెచ్ఎం మురళీకృష్ణ, ఎంఇఒలు రామారావు, కిరణ్‌బాబు, మునిసిపల్ కమిషనర్ పావని, చింతలపూడి సీఐ రవీంద్రనాయక్, ఎస్ఐ కుటుంబరావు పాల్గొన్నారు.

ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



పెదపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ రకాల ఫ్యాన్సీ డ్రెస్‌లతో విద్యార్థినులు స్టేజీ మీద అలరించారు. తొలుత ముగ్గులు, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి ఆయా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ, విద్యార్థినులు పాల్గొన్నారు.

నూతన చర్చి ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న జయరావు

దెందులూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సానిగూడెంలో నిత్య సహాయ మాత దేవాలయాన్ని సానిగూడెం గ్రామ ఆర్‌సీఎం చర్చి విచారణకర్త పాదర్ జోస్‌పాల్ ఆధ్వర్యంలో ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠ పాలనాధికారి పొలిమేర జయరావు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సుపీరియర్ జనరల్ ఆఫ్ మిషనరీ ఆఫ్ కాంపాషన్ రెవ బోబన్ కొల్లపల్లి, విచారణ గురువులు అమ్మన్ రాజా, పాదర్ పి.బాల, యాంజిల్, మైఖేల్, మాజీ సర్పంచ్ వై.శ్రీనుబాబు, సంఘస్తులు రమణ క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

బాలికా విద్యపై అవగాహన

ఏలూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బాలికల విద్య ఆవశ్యకతపై శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పద్మావతి మాట్లాడుతూ సమాజాభివృద్ధికి బాలికవిద్య ఎంతగానో తోడ్పడుతుందన్నారు. బాలికవిద్యకు సంబంధించి వివిధ చట్టాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



బడి వైపు ఒక అడుగు కార్యక్రమంలో అధికారులు

పోలవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని భావి భారత పౌరుల బంగారు భవిష్యత్తుకి పునాదులు బడిలోనే మొదలవుతాయని డీఎస్పీ ఎం వెంకటేశ్వ రరావు అన్నారు. పోలవరంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన బడివైపు ఒక అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు క్రమ శిక్షణ, సమాజంపై, పెద్దల పట్ల గౌరవ మర్యాదలు పెంపొందే దశ విద్యార్థి దశ నుంచే అన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కమ్మరగూడెం ఎంపీపీ పాఠశాలలో బడి వైపు ఒక అడుగు కార్యక్రమం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో ఇ.శ్రీనివాస్, సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్, హెచ్ఎం లక్ష్మీకాంతం, తదితరులు పాల్గొన్నారు.

చట్టాల పై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలు, శిక్షల పై అవగాహన పెంచుకోవాలని ఒంగోలు సెషన్స్ జిల్లా అధ్యక్షుడు డి. రాములు అన్నారు. సేయింట్ జోసఫ్ డెంటల్ కళాశాలలో కథోలిక న్యాయవాదుల జాతీయ సదస్సు జరిగింది. ఏలూరు అగ్రపీఠాధిపతులు బిషప్ జయరావు పొలిమేర సదస్సును ప్రారంభించారు. ముఖ్య అతిథిగాజడ్జి రాములు పాల్గొన్నారు. మతమార్పి నిరోధక చట్టం అవశ్యకతపై కర్ణాటక హైకోర్టు అడ్వకేట్ రాబిన్ క్రిస్టఫర్ అవగాహన కల్పించారు. బిషప్ మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమేర, పాదర్ డి.స్లీవరాజ్, అడ్వకేట్ రోనాల్డ్ రాజు, పాదర్ బాబుఫ్రాన్సీస్, తదితరులు పాల్గొన్నారు.

గుండుగొలను బ్రిడ్జి నిర్మాణ పనులపై తొలగిన సందిగ్ధత

దెందులూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలను వంతెన నిర్మాణం వలన రైతులు సాగునీరు రావంటూ గత రెండు రోజుల క్రితం రైతులు పనులు నిలుపుదల చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే ప్రభాకర్ టీడీపీ నేత బోడేటి మోహన్ బాబు కూటమి నేతలతో కలిసి, గుండుగులను వంతెన వద్దకు చేరుకుని అక్కడ సమస్యను ఎవరికి ఇబ్బంది లేకుండా పనులు జరిగే విధంగా బీఆర్‌సీ సంస్థల అధినేత బీఆర్‌సీ రవిచంద్రకు అప్పగించారు. టీడీపీ నాయకులు పర్వతనేని రామకృష్ణ, సిరిబత్తిన కొండబాబు, మోహన్‌బాబు, బాయి రాంప్రసాద్ పాల్గొన్నారు.

దత్తత చిన్నారులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలి

ఏలూరు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు బాలసదనంలో ఆశ్రయం పొందుతూ ప్రస్తుతం కేజీబీవీ వేలేరుపాడులో ఏడో తరగతి చదువుతున్న కుమారి నూకాలును తమిళనాడు శాలం జిల్లాకి చెందిన జనార్దన్, సీతలక్ష్మి దంపతులు దత్తత పొందారు. కలెక్టర్ వెట్రిసెల్వి రిజర్వ్ చేసుకున్న దంపతులకు శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దత్తత తీసుకున్న పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వాలని కోరారు. డీసీపీఓ డాక్టర్ సిహెచ్ సూర్యచక్రవేణి, శిశు గృహ మేనేజర్ భార్గవి, డీసీపీయు సిబ్బంది రాజేష్, రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షష్టి వేడుకలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

ఏలూరు జిల్లాలో ఘనంగా షష్టి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి కళ్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో తీర్థాలు నిర్వహించారు. జిల్లాలో అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించే ఉంగుటూరు మండలం కైకరంలో షష్టి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. బుట్టాయగూడెం నందాపురంలో వల్లీ సుబ్రహ్మణ్యేశ్వ రస్వామిని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దర్శించుకున్నారు. పోలవరం మండలంలో సుబ్రమణ్యేశ్వర షష్టి పూజలు భక్తులు ఘనంగా నిర్వహించారు. పోలవరం, పట్టిసీమ సుబ్రమణ్యేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టి.నరసాపురం అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం పురవీధుల్లో ఊరేగించారు. అన్న సమారాధన నిర్వహించారు. ఏలూరు, జీలుగుమిల్లి, పెదవేగి, జంగారెడ్డిగూడెం, చింత లపూడి, ద్వారకాతిరుమల మండలాల్లో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు ఘనంగా జరిగాయి.



పెదవేగిలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం




సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చునని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. అమీనాపేటలో ఉన్న శ్రీసురేష్‌చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూలులో విద్యార్థినీ విద్యార్థులకు దంత సంరక్షణ అనే అంశంపై అవగాహన ఆశ్రం ఆసుపత్రిలో పనిచేసే హెడ్‌వోడీ డాక్టర్ కంచెర్ల వంశీ ప్రసాద్‌తో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్యంలో ఏ చిన్న సమస్య వచ్చినా తల్లి దండ్రులకు తెలియజేయాలన్నారు. వాటిని ప్రాథమిక దశలోనే నిర్మూలించవచ్చునన్నారు. దంతాలను పరిశుభ్రత వైద్యులు సూచించినట్లే చేసుకోవాలంటే లేదంటే వ్యాధుల బారినపడడం, దంతాలు అరిగిపోవడం వంటి ప్రమాదం ఉందన్నారు. డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ దంతాలకు వచ్చిన ఏ సమస్యనైనా తక్షణం వైద్యులకు చూపించి చికిత్స చేయించుకోవాలని నిర్లక్ష్యం చేస్తే ఎన్నో అనర్థాలకు దారితీస్తుందని ఆ దంతాన్ని శాశ్వతంగా కోల్పోయే పరిస్థితులు కూడా ఏర్పడతాయన్నారు. ఆర్ఎస్ఐ నరేంద్ర, హెచ్ఎం స్రవంతి, పీఈటీ వర ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల భద్రతకు చట్టం చేయాలి

ఏలూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాయచోటి జిల్లా కొత్తపల్లి మండలంలోని ఓ పాఠశాలలో విద్యార్థులు కొట్టడంవల్ల తీవ్ర మనస్థాపానికి గురై మరణించిన ఉపాధ్యాయుడు ఏజాష్ అహ్మద్ మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ శనివారం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారని ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ తెలిపారు. కొందరు విద్యార్థుల ప్రవర్తన అందోళనకరంగా ఉందని, తరగతి గదిలోనే ఉపాధ్యాయుడిని కొట్టిన సంఘటననుబట్టి పాఠశాలలు, కళాశాలల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రతీ ఒక్కరు ఆలోచించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతంకాకుండా ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను రూపొందించడంతోపాటు, ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను చేయాలని డిమాండ్ చేశారు. టీచర్ మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ నగరంలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు నివాళులర్పించారు.



ఏలూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి అధ్యాపకుల నివాళి

నేడు కాల భైరవాష్టకం

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాస శుక్లపక్ష అష్టమి రోజున కాల భైరవస్వామి జయంతి. దీనినే భైరవ అష్టమి అని కూడా అంటారు. సాక్షాత్తు పరమశివుని అవతారం కాల భైరవుడు. ఈ స్వామివాహనం శునకం (కుక్క). అందుచేత ఈ రోజు కుక్కలను పూజించి ఆహారం సమర్పిస్తారు. భైరవావతరణానికి కారణం కూడా ఉందని పురాణాలు తెలుపుతున్నాయి. ఒకానొక సందర్భంలో బ్రహ్మ, విష్ణువు మధ్య వివాదాంశం తలెత్తింది. విశ్వాన్ని ఎవరు కాపాడుతున్నారు, పరతత్వం ఎవరు అని చర్చకు దారితీసింది. అప్పుడు మహర్షులు సమస్త విశ్వానికి మూలమైన పరతత్వం తెల్పి చెప్పడానికి వీలుకాదని, ఈ సమస్య దీనికి కారణం మీరిద్దరూ ఆ శక్తి విభూది నుంచి ఏర్పడినవారే కదా అన్నారు. రుషులు, ఈ వాదనను అంగీకరించిన శ్రీమహావిష్ణువు మౌనం వహించారు. కాని బ్రహ్మ అందుకు అంగీకరించలేదు. ఆ పరతత్వం మరెవ్వరోకాదు నేనే అని బ్రహ్మ అహంను ప్రదర్శించాడు. అప్పుడు వెంటనే పరమ శివుడు భైరవ స్వరూపాన్ని చూపి బ్రహ్మకు గర్వభంగం కలిగించాడు. ఈ భైరవ అవతారానికి కారణమైన రోజు మార్గశిర మాస శుద్ధ అష్టమికావడంతో కాల భైరవాష్టమిగా ప్రసిద్ధి చెందింది. ఈ రోజున కాల భైరవుడిని పూజిస్తే శని రాహు కేతు దోషాల నుంచి విముక్తి కలుగుతుందని పురాణాలు తెలియచేస్తున్నాయి. రోగాల నుంచి, ప్రమాదాల నుంచి, శత్రువుల నుంచి బయటపడతారు. నీతివంతమైన జీవితం గడపడానికి కాల భైరవుడు మార్గదర్శకం చేస్తారని పురాణాల్లో ఉంది.



కాల భైరవ స్వామి



కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాడు లాగే పోటీలో సరదాగా పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని

విద్యాబోధనలో నిరంతర పర్యవేక్షణ ఉండాలి

మంత్రి కొలుసు పార్థసారథి.. కోలాహలంగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు

ముసునూరు/చాట్రాయి/ముదినేపల్లి/కలిదిండి / కైకలూరు/ మండవల్లి/, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యాబోధనలో ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు నిరంతర పర్యవేక్షణ కలిగి ఉన్నప్పుడే వారు రాణిస్తారని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం ముసునూరు జడ్పీ పాఠశాలలో జరిగిన పిల్లల బంగారు భవిష్యత్ కోసం 'బడివైపు ఒక అడుగు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పా ల్గొన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, గ్రామ ప్రముఖులు దేవినేని వరప్రసాదరావు ఆర్థిక సాయం రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన వంటశాల, డైనింగ్ హాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులను ఆర్డీవో వాణితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో గొప్ప వ్యక్తులు అబ్దుల్ కలామ్, అంబేడ్కర్, సీఎం నారా చంద్రబాబునాయుడు, ఇంజనీర్లు, కలెక్టర్ సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివి గొప్పవా రయ్యారని గుర్తుచేశారు. ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్ టీచర్స్‌తో నాణ్యమైన విద్యను చెబు తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తల్లిదం డ్రులు తమ పిల్లలను చేర్పించి ఉచిత సదుపా యాలు, నాణ్యమైన విద్యను సద్విని యోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతల ఆర్థిక సాయం విలువ కట్టలేనిదని, ఇంత పెద్ద సువిశాల పాఠశాల నిర్మాణానికి కారుకులైన దేవినేని వరప్రసాద రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు హెల్త్‌కార్డులు, పారిశుధ్యకార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. పాఠశాల నిర్మాణదాతలైన దేవినేని వరప్రసాదరావును మంత్రి సన్మాంచారు. సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియా, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు, పీఎంసీ చైర్మన్ నక్కా యోహాను, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులలో విద్యా ప్రమాణాలు పెంచటమే మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని చాట్రాయి మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం, తహసీల్దార్ ప్రశాంతి, ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఏడు జడ్పీ హైస్కూల్స్, ఏడు యుపీ స్కూల్స్, 49 ప్రాథమిక పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు పండుగలా నిర్వహించారు. పాఠశాలను అలంకరించి రంగవల్లులు దిద్దారు. అనంతరం సహపక్తి భోజనాలు చేశారు. ఎంఈవో బ్రహ్మచారి, నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, అత్తులూరి శ్రీనివాసరావు, నక్కా రాము, తల్లాడ శ్రీనివాసరావు, పి.శేఖరరెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి హైస్కూల్‌లో 200 మందికిపైగా తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యారు. వడాలి హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పాల్గొన్నారు. ఎంఈవో నరేష్ కుమార్ అయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కలిదిండి జడ్పీ హైస్కూల్‌తో పాటు అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ - ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సిహెచ్.ప్రసాద్ గుప్తా, టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, విద్యాకమిటీ చైర్మన్ తోటగొల్లయ్య, హెచ్ఎం స్వర్ణ కుమారి పాల్గొన్నారు. కైకలూరు మండలం భుజబలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో, కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలను పరిగణనలోనికి తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు ఆటలపోటీల్లో పాల్గొని అందరిని ఉత్సాహపరిచారు. మండల ప్రత్యేక అధికారి నాగలింగాచారి, కూటమి నేతలు పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, బికెఎం నాని, కొల్లి వరప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహిం, ఎంఈఓలు రామారావు, శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండవల్లి మండలంలోని మండవల్లి, చింతపాడు, కానుకొల్లు గ్రామాల్లోని పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. మండవల్లిలో ముఖ్యఅతిథిగా ఎంఈవో రత్నసునాదం, పాఠశాల హెచ్ఎం సీహెచ్ పిచ్చేడు, చైర్మన్ విజయశాంతి, వైస్ చైర్మన్ శ్రీధర్, కానుకొల్లు సమావేశంలో హెచ్ఎం మాధవ్‌కుమార్, సర్పంచ్ థామస్ తదితరులు పాల్గొన్నారు. చింతపాడు హైస్కూల్లో జరిగిన సమావేశంలో సర్పంచ్ ఘంటసాల మహావిష్ణు ఎంపీటీసీ జయమంగళ వీర్రాజు, హెచ్ఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయి మండలం సి.గుడిపాడు హైస్కూల్‌లో సమావేశానికి హాజరైన పేరెంట్స్

టీడీపీ నేత సురేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

నూజివీడు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు బొర్రా సురేష్ కుటుంబ సభ్యులను ఆదుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎంఎస్‌పాలెం గ్రామంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మరణించిన టీడీపీ నాయకులు బొర్రా సురేష్ కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామి ఇచ్చారు. యనమదల నాని, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాలు మంజూరుపై హర్షం

చాట్రాయి, డిసెంబరు 7 (డిసెంబరు): ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు, నందిగామ పట్టణాలలో కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల బీజేపీ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఏపీలో విద్యారంగ అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని అన్నారు. బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధించి ప్రపంచంలో అజేయ శక్తిగా ఎదగడం ఖాయమన్నారు.



సింగరాయపాలెంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం





గోపవరంలో సుబ్రహ్మణేశ్వరస్వామి.. నూజివీడు మండలం అన్నవరంలో



కైకలూరులో స్వామి కల్యాణోత్సవం

వైభవంగా షష్ఠి

ముదినేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక షష్ఠి కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం వద్ద పుట్టలో పాలుపోసి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ శనివారం తెల్లవారుజామున ఉత్సవాలను ప్రారంభిం చారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి పూజలు జరిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, అధికారులు, అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. తొలి రోజు సుమారు 25 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మహిళలు పాలు పొంగళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దంపతులు పాల్గొని పూజలు జరిపారు. శనివారం రాత్రి స్వామి వైభవంగా కల్యాణం జరిగింది. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, నీలం శివ రమేష్, పరసా కృష్ణ, పరసా రమేష్, దగాని నాగలక్ష్మి, సోవమ్మ, సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, రాధాకృష్ణ తదితరులు పాల్గొని పూజలు చేశారు. సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వీరభద్రరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు. బీజేపీ నాయకులు పసుపులేటి నరసింహారావు, మేలిమి చిట్టిబాబు పాల్గొన్నారు.



సింగరాయపాలెంలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న దంపతులు, తిలకిస్తున్న భక్తులు

● **కలిదిండి** : పెదలంకలో మాజీ వీఆర్వో అడివి రామదాసు దంపతులచే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అఖండ దీపారాధన, అష్టోత్తర పూజ నిర్వహించారు. పోకల వెంకటేశ్వరరావు దంపతులచే పుట్టలో పాలుపోసిన అనంతరం స్వామి దివ్య దర్శనం ప్రారంభించారు. పోకల శ్రీనివాస్ ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈవో శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోరుకొల్లు, వెంకటాపురం గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దర్శించుకున్నారు.

● **కైకలూరు** : కైకలూరు చిన్నచెరువుగట్టుపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, స్వర్ణకుమారి దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆచవరంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఐదువేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. వరహాపట్నం, పల్లెవాడ, ఆలపాడు తదితర గ్రామాల్లో షష్ఠి మహోత్సవాలు ఘనంగా జరిపారు.

● **మండవల్లి** : మండవల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం నుంచి భక్తులు పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకుముడిలోని శ్రీగణ పతి దత్తాత్రేయలో ఎగ్జిక్యూటివ్ గురజాడ ఉదయశంకర్ దంపతులు స్వామి కల్యాణం నిర్వహించారు.

● **నూజివీడు టౌన్** : సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని నూజివీడు మండలం అన్నవరం గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పుల్లారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **ముసునూరు** : గోపవరంలో వునన వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వందలాది మంది భక్తుల మధ్య శనివారం వైభవంగా నిర్వహించారు. 108 జంటల దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం చేశారు. స్వామిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామప్రముఖుల ఆధ్వర్యంలో జరిగిన భారీ అన్నసమారాధనలో భక్తులు వేలాదిగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రి స్వామివారి కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.



ఆచవరంలో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



వివాహం.. ఆడంబరం!

- వివాహాలకు మూడేళ్లలో 50 శాతం పెరిగిన ఖర్చు
- కనిష్ఠం రూ.5 లక్షలు.. గరిష్ఠం రూ.30 లక్షలు
- ధనిక వర్గాల ఇళ్లలో పెళ్లి ఖర్చులకు ఎల్లలు లేవు
- ఎగువ, మధ్య తరగతుల్లో పిల్లలదే పెళ్లి పెత్తనం

రెండు జీవితాలు కలయిక వివాహ బంధం. యుక్త వయస్సు వచ్చిన అమ్మాయి అబ్బాయి కలిసి పయనించడానికి పెద్దలు చూపిన మార్గమే వివాహం. మనసు ఎదిగిన వ్యక్తితో నడవాలని అమ్మాయిలు అనుకూలమైన యువతి కావాలని అబ్బాయిలు భాగస్వామి ఎంపికలో పరిణతితో వ్యవహరిస్తారు. కన్నవారిని కష్టపెట్టకుండా తాము ఇష్టపడ్డవారిని వివాహం చేసుకుంటూ నేటి వ్యవస్థలో అధిక శాతం యువత ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే సమయంలో వివాహ వేడుకల్లో ఆధునిక పోకడలు ఆడంబరంగా మారాయి. జీవితంలో గుర్తుండిపోయేలా వివాహ వేడుకకు స్తోమతుకు మించి ఖర్చు చేస్తున్నారు. ఉన్నత వర్గాల వారి పెళ్లి వేడుక, ఖర్చు అంబరాన్ని అంటుతోంది. మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలతో పాటు పేదింట వివాహ ఆడంబరాలపై ఈ ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. - పాలకొల్లు

ఒకప్పుడు వివాహంతో ఆయా కుటుంబాల ఆర్థిక నేపథ్యాల అనుగుణంగా జరిగేది. ఇప్పుడు విపరీత పోకడలతో పేద, మధ్య తరగతుల కుటుంబాలలో పిల్లల వివాహాలు ఆడంబరంగా చేసి అప్పులు పాలవుతున్నారు. కార్మిక వర్గాలలో కని ష్ఠంగా వివాహ ఖర్చు రూ.5 నుంచి రూ.10 లక్షలు అవుతోంది. దిగువ మధ్య తరగతి కుటుంబాలలో వివాహనికి రూ.10 నుంచి రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మధ్య తరగతి కుటుంబాలలో రూ.15 నుంచి రూ.20 లక్షలు, ఎగువ మధ్య తరగతి కుటుంబాలలో పెండ్లి ఖర్చు రూ.20 నుంచి రూ.30 లక్షలు అవుతోంది. సంపన్న వర్గాలలో పెళ్లి ఖర్చుకు ఎల్లలు ఉండడం లేదు.

పెళ్లి వేడుక కూడా హోదా..

నేటి ఆదునిక పోకడలలో వివాహం అనేది సాంప్రదాయమే కాకుండా స్టేటస్ సింబల్‌గా మారింది. తమకు నచ్చినట్లు పెళ్లి చేయాలని వధూవరులు కోరుతుంటే తల్లిదండ్రులు వ్యతిరేకించినప్పటికీ చివరకు పిల్లలు అభీష్టం మేరకు వివాహాలు చేస్తున్నారు. గడిచిన మూడేళ్లలో పోలిస్తే వివాహ ఖర్చు 50శాతం పెరిగింది. వివిధ సర్వేలు ప్రకారం ఏటా దేశంలో కోటి పైగా వివాహాలు జరుగుతుంటే రూ.6లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు.

యువతదే ఇష్టం

మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలలో వివాహ ఖర్చులను విశ్లేషిస్తే ఆసక్తికర విషయాలు వెల్లడవుతున్నాయి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాలలో రెండు చేతులా సంపాదిస్తున్న యువత తామే ఖర్చును భరిస్తూ దగ్గరుండి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తగ్గేదేలే..

వివాహం, రిసెప్షన్ భోజనాలలో తగ్గేదే లేదంటూ ఖర్చు చేస్తున్నారు. ఉన్నత వర్గాల వివాహ విందు డైనింగ్ రూమ్‌లు కళ్లు చెదిరే హంగులతో ఉంటాయి. పలు రకాల ఖరీదైన పదార్థాలతో విందు సిద్ధం చేస్తారు. పేద వర్గాలలో సైతం జీడిపప్పు లేనిదే వంటకం లేదని పెళ్లి భోజనంలో నిరూపిస్తున్నారు. జీడిపప్పు వినియోగించడంతో ఇప్పుడు కిలో జీడిపప్పు ధర రూ.600 నుంచి రూ.వెయ్యికి పెరిగింది. స్వీటు, హాటు తాహతు మించి ఏర్పాటు చేస్తున్నారు. ఈవిధంగా పేదవర్గాలలో పెళ్లి విందుకు కేవలం ఒక జీడిపప్పుకే 5కిలోలు కొనుగోలు చేస్తే గరిష్ఠంగా సంపన్న శ్రేణులతో 100 కిలోలు జీడిపప్పును వినియోగిస్తున్నారు. విందు సమయంలో ఆహార వృథాను అరికట్టలేకపోతున్నారు.

ఆనక అప్పులే..!

ఇప్పుడు పేద వర్గాలు మొదలుకొని మధ్య తరగతి స్థాయి వరకూ పెళ్లిల్లలో వేడుకలు అయిన తర్వాత చిట్టా తీస్తే అప్పులే మిగులుతున్నాయి. రైతువారీ కుటుంబాలలో పొలాలు అమ్మితే ఉద్యోగులు వ్యక్తిగత రుణాలు, వ్యాపారులు ప్రైవేటు అప్పులు వైపు దృష్టి సారిస్తున్నారు. మొత్తంగా నవంబరు, డిసెంబరు నెలల్లో దేశవ్యాప్తింగా జరిగిన, జరుగుతున్న అరకోటి పైబడిన వివాహాలలో 60శాతం పెండ్లి వేడుకలు అప్పులతోనే మిగులుతున్నాయి.

క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి రూ.150 కోట్లు : మంత్రి

నూజివీడు టౌన్/ముసునూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి రూ.150 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయిం చిందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం నూజివీడు ఎంఆర్ అప్పారావు కాలనీ లో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మందిరాల నిర్మాణం ద్వారా ప్రశాంతమైన వాతావరణంలో భగవంతుడిని స్మరించుకునే అవకాశం కలుగు తుందన్నారు. దీనిలో భాగంగా రూ.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● ముసునూరు మండలం ముసునూరులో పొగాకు పంటను నరికివేసిన ఆగంతుకుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పోలీస్, రెవె న్యూ అధికారులను మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. ముసునూరులో మూడురోజుల క్రితం రైతు చెన్ను నాగరాంబాబుకు చెందిన 80 సెంట్లు భూమిలో గెల దశకు వచ్చిన పొగా కు పంటను నరివేసిన నేపథ్యంలో శనివారం పొగాకు పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నాశనం చేసిన వ్యక్తిని గుర్తించి శిక్షించి, పంటనష్టపోయిన రైతుకు నష్టపరిహారం ఇప్పించాలని నూజివీడు ఆర్డీవో వాణి, పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు

కైకలూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైవీఎనాఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఎస్కే రమేష్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే అమూల్యమైన వారి జీవితం నాశనమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విజయ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐలు ఆదినారాయణరావు, అబ్దుల్ ఆలీం, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు.. ఇద్దరి అరెస్ట్

చాట్రాయి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం గ్రామంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు జరిపిన దాడులలో ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు.

● నూజివీడు : నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఓగిరాల తండాలో సారా తయారీ కేంద్రాలపై ఆమె ఎక్సైజ్ సీఐ మస్తానయ్యతో కలిసి దాడులు చేసి వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

కైకలూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమ మద్యం, బెల్టుషాపుల నిరోధానికి విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎస్కే రమేష్ తెలిపారు. శనివారం నిర్వహించిన దాడుల్లో ముదినేపల్లి మండలం వాడవల్లికి చెందిన కూనబత్తిన వీరాంజనేయులును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

45 కేసులు నమోదు.. రూ.3.50లక్షలు అపరాధ రుసుం

మండవల్లి డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోకుముడి దత్తాశ్రమం వద్ద 165 జాతీయ రహదారిపై జిల్లా డిప్యూటీ రవాణా శాఖ కమిషనర్ ఎస్కే కరీం ఆదేశాల మేరకు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ జి.స్వామి, ఎన్‌సెహ్రా, ప్రజలు వాహనాలను తనిఖీ చేశారు. 45 కేసులు నమోదు చేసి రూ.3.50లక్షలు అపరాధ రుసుము విధించారు.